పలు మండలాల్లో జోరువాన



తిరుపతి - బెంగళూరు బైపాస్ రోడ్డులో చెర్లోపల్లి వద్ద వర్షం





చిత్తూరు సమీపంలోని ఇరువారం వద్ద వర్షంలో వస్తున్న కారు వేగానికి చిమ్ముతున్న వర్షపునీరు

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గడిచిన 24 గంటల్లో పలు మండలాల్లో జోరువాన కురిసింది. కొన్ని చోట్ల ఎండల తీవ్రత కొనసాగడం విశేషం. అత్యధికంగా గుడిపాలలో 72మిమీ, అత్యల్పంగా పలమనేరులో 3.4 మిమీ వర్షం కురిసింది. మండలాలవారీగా బంగారుపాళ్యంలో 70మిమీ, చిత్తూరు రూరల్‌లో 63.2, వి.కోటలో 55.6, వెదురుకుప్పంలో 44.2, నింద్రలో 43.2, పుంగనూరులో 42.6, తవణంపల్లెలో 42.4, శ్రీరంగరాజపురంలో 40.4, యాదమరిలో 36.4, చిత్తూరు అర్బన్‌లో 35.3, నగరిలో 33.8, కుప్పంలో 33.2, గంగాధర నెల్లూరులో 28, రామకుప్పంలో 20.6, బైరెడ్డిపల్లెలో 20.4, చౌడేపల్లెలో 20, పూతలపట్టులో 19.8, పెనుమూరులో 13.4, ఐరాలలో 13.2, పాలసముద్రంలో 11.4, గుడుపల్లెలో 8.6, పెద్దపంజాణిలో 6.8, గంగవరంలో 6.6, కార్వేటినగరంలో 5.6, శాంతిపురంలో 5.2, నదుంలో 4.2 మిమీ వర్షపాతం నమోదయ్యింది.


ఇంద్ర ధనుస్సు మెరిసింది

వెదురుకుప్పం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కార్వేటి నగరం మండలం డీఎంపురం పంచాయతీ ఎస్ఎన్‌కండ్రిగ వద్ద గురువారం సాయంత్రం ఇంద్ర ధనుస్సు మెరిసి కనువిందు చేసింది.ఇదే మండలంలోని కత్తెరపల్లె వద్ద కూడా ఇంద్ర ధనుస్సు చూపరులను ఆకర్షించింది.



నిండుకుండలా ఎన్టీఆర్ జలాశయం

ఒక గేటు ద్వారా నీటి విడుదల



చిత్తూరు అర్బన్/పెనుమూరు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): పెనుమూరు, పూతలపట్టు మండలాల్లో బుధవారం రాత్రి కురిసిన వర్షానికి ఎన్టీఆర్ జలాశయంలోకి భారీ స్థాయిలో నీరు చేరింది. ఇదివరకు కురిసిన వర్షానికే 80శాతం నిండిన జలాశయం... బుధవారం కురిసిన వర్షంతో నిండిపోయింది.ఈ నేపథ్యంలో జలాశయం నుంచి గురువారం ఉదయం ఇరిగేషన్ ఏఇ భరత్ ఒక గేటు ద్వారా 85 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. ఇరిగేషన్ ఈఈ మురళి డ్యాంను పరిశీలించారు.జలాశయం నిండిపోవడంతో ఏడాది పాటు చిత్తూరు నగర అవసరాలకు తగినంత నీటిని సరఫరా చేయవచ్చని అధికారులు భావిస్తున్నారు.

మళ్లీ తెరపైకి చిగురుగుంట గోల్డ్ మైన్స్

- బంగారు నిక్షేపాలపై బీజీఎంఎల్, జీఎస్ఐ సర్వే
- తుదిదశలో మైన్స్ అధికారుల పరిశీలన



ఒకప్పటి మైన్స్ కార్మికుల క్వార్టర్స్



బంగారు నిక్షేపాలున్నట్లు గుర్తించిన ప్రాంతం

చిత్తూరు/చిత్తూరు సెంట్రల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గుడుపల్లె మండలంలోని చిగురుగుంట గోల్డ్ మైన్స్ వ్యవహారం మళ్లీ తెరపైకి వచ్చింది. 2001లో మూతపడిన ఈ గనులను తెరిచే విషయమై ప్రభుత్వం ఆలోచిస్తోంది. ఇటీవల వివిధ శాఖల అధికారులు సర్వే చేసి రాష్ట్ర ఉన్నతాధికారులకు నివేదిక అందించారు.

గుడుపల్లె మండలంలోని రెండు ప్రాంతాల్లో బంగారు గనులున్నాయని గుర్తించి.. బిసానత్తం గ్రామంలోని గనిని 1968లో, చిగురుగుంట గ్రామంలోని గనిని 1978లో ప్రారంభించారు. ఎంఈసీఎల్ సంస్థ సారథ్యంలో తవ్వకాలు మొదలుపెట్టారు. ఇక్కడ క్వార్ట్జ రాయిని (బంగారు ముడి పదార్థం) తీసి ముడి సరుకును విక్రయిస్తూ వచ్చారు. సుమారు పదేళ్ల పాటు ఎంఈసీఎల్ సంస్థ క్వార్ట్జ వెలికి తీసి కేజీఎఫ్‌లోని బీజీఎంఎల్ (భారత్ గోల్డ్ మైనింగ్ లిమిటెడ్)కు అందిస్తూ వచ్చింది. కాలక్రమేణా ఎంఈసీఎల్ సంస్థ ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకోవడంతో గనుల నిర్వహణ కష్టసాధ్యంగా మారింది. మరో మార్గం లేక గనులను కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ బీజీఎంఎల్‌కు విక్రయించింది. 1982లో కొనుగోలు చేసిన బీజీఎంఎల్ అప్పటి నుంచి 19 ఏళ్ల పాటు అంటే 2001 జనవరి 15 వరకు బంగారు ముడి ఖనిజం వెలికి తీస్తూ వచ్చింది. కేజీఎఫ్‌లో బీజీఎంఎల్ నిర్వహిస్తున్న ఛాంపియన్ గని నష్టాల్లో పడడంతో దాని ప్రభావం చిగురుగుంట, బిసానత్తం గనులపై కూడా పడింది. దీంతో కంపెనీ లాకౌట్ ప్రకటించింది.గనులు మూత పడి వేల కుటుంబాలు రోడ్డున పడ్డాయి.

పలుమార్లు ప్రారంభించేందుకు చర్యలు

2011లో అప్పటి ప్రభుత్వం మరో ప్రయత్నంగా 263 హెక్టార్ల భూమిని ఎంపిక చేసి, 150 బోర్లు డ్రిల్ చేసి బంగారం లభ్యతపై అన్వేషణ మొదలుపెట్టింది. చిగురుగుంట, బిసానత్తం ప్రాంతాల్లో ఇంకా బంగారం ఉన్నట్లు నిర్ధారణకు వచ్చింది.2019లో అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం కూడా దీన్ని ప్రారంభించేందుకు ఓ అడుగు ముందుకేసింది. 2022లో రూ.450 కోట్లతో ఎన్ఎండీసీ సంస్థ టెండర్లు దక్కించుకుంది. కార్యరూపం దాల్చలేదు.

8.5 టన్నుల బంగారం ఉండొచ్చని అంచనా

263 హెక్టార్లలో విస్తరించిన చిగురుగుంట, బిసానత్తం గనుల్లో ఇప్పటికీ 18 లక్షల టన్నుల బంగారం ముడి ఖనిజం ఉండొచ్చని ఎన్ఎండీసీ అధికారులు అంచనా వేశారు. ఓ టన్ను ముడి పదార్థం నుంచి 5.5 గ్రాముల బంగారం లభిస్తుంది. మొత్తం 8.5 టన్నుల బంగారం ఉండొచ్చని అంచనా వేస్తున్నారు.

తాజాగా కూటమి ప్రభుత్వ సర్వే

జిల్లా భూగర్భ, గనుల శాఖ డీడీ ఎస్కేవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఓ బృందం ఇటీవల గుడుపల్లె మండలంలోని చిగురుకుంట, అతినత్తం, బిసానత్తం ప్రాంతాల భౌగోళిక పరిస్థితులపై అధ్యయనం చేసింది. గతంలో బీజీఎంఎల్, జీఎస్ఐలతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల జియాలజిస్టులు చేసిన అధ్యయనాలనూ పరిశీలించింది. 220 హెక్టార్లలో చిగురుకుంట, 43 హెక్టార్లలో బిసానత్తం, అతినత్తం ప్రాంతాలు విస్తరించి ఉన్నాయని సర్వే చేశారు. సుమారు 250 నుంచి 300 మీటర్ల లోతులో ఖనిజాలు లభ్యమవుతాయని అంచనా వేస్తున్నారు. ఇక్కడి భౌగోళిక, భూగర్భ పరిస్థితులను ఉన్నతాధికారులకు నివేదించామని ఎస్కేవీ సత్యనారాయణ వివరించారు.



తిరుమలలో మీనాక్షి

సినీ హీరోయిన్ మీనాక్షి చౌదరి తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు.గురువారం వేకువజామున సుప్రభాత సేవలో పాల్గొన్నారు.

గజదాడుల నివారణకు కృషి

డీఎఫ్‌వో సుబ్బరాజు

7లో

కాణిపాక ఆలయ చైర్మన్‌గా మణినాయుడు

రెండోసారి అవకాశం ఇచ్చిన చంద్రబాబు



ముఖ్యమంత్రి చంద్రబాబుతో మణినాయుడు

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కాణిపాక ఆలయ పాలకమండలి చైర్మన్‌గా వి.సురేంద్ర బాబు అలియాస్ మణినాయుడు రెండవ సారి నియమితులయ్యారు.టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీ ఎదుగుదలకు ఆయన చేసిన కృషిని గుర్తించి ముఖ్యమంత్రి చంద్రబాబు ఆయనకు రెండవసారి అవకాశం ఇచ్చారు. రాష్ట్రంలో టీడీపీ అధికారంలో ఉన్నా, లేకున్నా ఆలయ అభివృద్ధి కోసం మణినాయుడు కృషి చేశారు.గతంలో 8 నెలల కాలం ఆయన ఆలయ చైర్మన్‌గా పని చేశారు.ఎన్నికలు జరిగి వైసీపీ ప్రభుత్వం రావడంతో చైర్మన్ పదవిని వదులుకున్నారు.మణినాయుడికి చైర్మన్ పదవి దక్కడంతో గురువారం కాణిపాకంలో ఆయన అభిమానులు టపాకాయలు కాల్చి, స్వీట్లు పంచి సంబరాలు నిర్వహించారు.

ముక్కంటి ఆలయ చైర్మన్‌గా సాయిప్రసాద్

సామాన్య కార్యకర్తకు పవన్ అవకాశం



డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌తో సాయిప్రసాద్

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వ రాలయ ధర్మకర్తలమండలి చైర్మన్‌గా కొట్టే సాయి ప్రసాద్ నియమితులయ్యారు.రాష్ట్రస్థాయిలో కీలకమైన ఆలయం కావడంతో చైర్మన్ స్థానం కోసం పెద్దఎత్తున పోటీ నడిచింది.టీడీపీ, బీజేపీ, జనసేన నుంచి చాలా మంది ప్రయత్నాలు సాగించారు. అయితే అనూహ్యంగా జనసేన కోటాలో సాయిప్రసాద్‌ను చైర్మన్ పదవి వరించింది. శ్రీకాళహస్తి పట్టణం బహదూరుపేటకుచెందిన సాయిప్రసాద్ జనసేన ఆవిర్భావం నుంచి పార్టీలో చురుగ్గా వుంటూవచ్చాడు.మూడేళ్ల క్రితం వైసీపీ పాలనలో అప్పటి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఆందోళనా కార్యక్రమాలు నిర్వహించాడు.ఇందులో భాగంగా ఓసారి దిష్టిబొమ్మను దహనం చేసే క్రమంలో సీఐ అంజుయాదవ్ చెంపదెబ్బలకు గురి కావడంతో ఆ వీడియో సంచలనంగా మారింది.ఈ ఘటనతో ఒక్కసారిగా పవన్‌కల్యాణ్ దృష్టిలో పడ్డాడు.ఆయన తిరుపతికి చేరుకుని సాయిప్రసాద్‌ను పరామర్శించి ధైర్యం చెప్పారు.అలాగే పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు కూడా చేశారు. ఆ తరువాత కూటమి గెలుపు కోసం కొణిదల విజయం- కొట్టే లక్ష్యం అనే నినాదంతో 35 వాహనాల్లో శ్రీకాళహస్తితో పాటు రాష్ట్ర వ్యాప్తంగా తన బంధు వర్గ ప్రజలను చైతన్య పరిచేలా విస్తృతంగా ప్రచారం చేశాడు.ఎన్నికల సమయంలో కూడా శ్రీకాళహస్తిలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి గెలుపు కోసం గట్టిగా కృషి చేశారు. ఇక జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా కొనసాగిన వినుత రెండు నెలల క్రితం డ్రైవర్ రాయుడి హత్య కేసులో చిక్కుకున్నారు. దీంతో అధిష్ఠానం ఆమెను జనసేననుంచి బహిష్కరించినట్లు ప్రకటించింది. అప్పటి నుంచి ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్యదర్శిగా, శ్రీకాళహస్తి జనసేన కీలక నేతగా సాయిప్రసాద్ మారారు.దేవాలయాల బోర్డు పదవుల్లో శ్రీకాళహస్తీశ్వరాలయాన్ని జనసేనకు కేటాయించడంతో సాయిప్రసాద్‌ను ముక్కంటి సేవా భాగ్యం వరించింది.సీఐ తనను కొట్టిన ఘటనపై నాడు జనసేన అధినేత పవన్ కల్యాణ్ అండగా నిలబడ్డారని, ప్రస్తుతం గుర్తుపెట్టుకుని పదవి ఇచ్చిన ఘనత కూడా ఆయనకు దక్కుతుందని సాయిప్రసాద్ సంతోషం వ్యక్తం చేశాడు.ముక్కంటి భక్తులకు మెరుగైన సేవలు కల్పించడమే ధ్యేయంగా పనిచేస్తానని స్పష్టం చేశారు.

22 నుంచి ముక్కంటి ఆలయంలో
నవరాత్రి ఉత్సవాలు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈ నెల 22 నుంచి అక్టోబరు 1వ తేదీ వరకు నవరాత్రి మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఈవో బాపిరెడ్డి తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. దేవీ నవరాత్రులలో జ్ఞానప్రసూనాంబ అమ్మవారు రోజు కొక అలంకారంలో దర్శనమివ్వనున్నారు. 22న కలశ స్థాపన, అమ్మవారి స్థల నిర్ణయం, శైలపుత్రి అలంకారం, 23న మహావిష్ణు ఉత్సవం, బ్రహ్మచారిణిదేవి అలంకరణ, 24న తపస్సు ఉత్సవం, చంద్ర ఘంటాదేవి అలంకారం, 25న కూష్మాండదేవి అలంకారం, 26న అశ్వాసుర వధ ఉత్సవం, స్కంధమా తదేవి అలంకారం, 27న వ్యాఘ్రాసుర వధ ఉత్సవం, కాత్యాయని దేవి అలంకారం, 28న రక్తబీజాక్షరి ఉత్సవం, శ్రీకాళరాత్రిదేవి అలంకారం, 29న బండాసుర వధ ఉత్సవం, మహాగౌరిదేవి అలంకారం, 30న మహర్నవమి ఉత్సవం, మహిషాసుర మర్ధిని అలంకరణ, 1న పార్వేట ఉత్సవం, విజయదశమి నిర్వహించనున్నారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని ఈవో కోరారు.

టీటీడీ ఆరోగ్య వరప్రసాదినికి రూ.10 లక్షల విరాళం

తిరుమల, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ఆరోగ్య వరప్ర సాదిని పథకానికి గురువారం రూ.10 లక్షలు విరాళంగా అందింది. విజయన గరానికి చెందిన కృష్ణ హరీశ్ ఈశ్వర విరాళం డీడీని తిరుమలలో టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడికి అందజేశారు. ఈ కార్యక్రమంలో బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.



సర్వ దర్శనానికి 14 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయాయి. క్యూలైన్ శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టు మెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

మంగళవారం హుండీ ఆదాయం: రూ.2.86 కోట్లు

బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 68,213

తలనీలాలు సమర్పించినవారు: 29,410









శ్రీవారి ఆలయానికి లైటింగ్

బ్రహ్మోత్సవాలకు తొలి వెలుగులు



తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలు ఈనెల 24 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు వైభవంగా జరుగనున్నాయి. ఈక్ర మంలో ఇప్పటికే తిరుమలలో చేసిన విద్యుత్ అలంకరణ పనితీరును గురు వారం రాత్రి పరిశీలించారు. శ్రీవారి ఆలయ గోపురం, ప్రాకారం, ధ్వజస్తంభం, వెండివాకిలి, మహద్వారం వాకిలి వద్ద చేసిన విద్యుత్ లైట్లతో పాటు తిరుమలలోని పలు ప్రదేశాల్లో అమర్చిన కటౌట్లు, తోరణాల లైట్లను వెలిగించారు. గుర్తించిన లోటుపాట్లను సవరించారు. మరోసారి శుక్రవారం ఈ విద్యు త్ అలంకరణలను పరిశీలించనున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి











రిజిస్ట్రేషన్ చేసుకుంటున్న అభ్యర్థులు



చదలవాడ రమణమ్మ ఇంజనీరింగ్ కళాశాల వద్ద బారులు తీరిన బస్సులు

బస్సులు బయలుదేరే సమయంలో
'అమరావతి' ప్రయాణం రద్దు

వెనుదిరిగిన డీఎస్సీ అభ్యర్థులు ● 1506 మంది రిజిస్ట్రేషన్.. వారి సహాయకులూ రాక ● భారీగా ఏర్పాట్లు చేసిన అధికారులు

తిరుపతి(విద్య), సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కాసేపట్లో బస్సులు బయలుదేరతాయనగా డీఎస్సీ అభ్య ర్థుల అమరావతి ప్రయాణం రద్దయింది. సీఎం చంద్ర బాబు చేతుల మీదుగా నియామక పత్రాలు అందించే కార్యక్రమాన్ని నిర్వహించతలపెట్టిన మైదానం వర్షం నీటితో నిండిపోవడంతో రద్దుచేసినట్లు అధికారులు ప్రక టించారు. దీంతో వీరంతా తిరుపతి నుంచి వెనుదిరిగారు. ఉమ్మడి జిల్లాలో మెగా డీఎస్సీ ద్వారా ఎంపికైన అభ్యర్థు లకు అమరావతిలో శుక్రవారం నియామక పత్రాలు అందించే కార్యక్రమం చేపట్టారు. దీనికిగాను ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి ఎంపికైన 1408 మంది, జోనల్ అభ్యర్థులు 124 మంది కలిపి 1532 మంది.. వారి సహా యకులను కలిపి మొత్తం 3064 మందిని అమరావతికి తీసుకెళ్లేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. 86 బస్సు లను కేటాయించారు. అందరినీ తిరుపతి- రేణిగుంట రోడ్డులోని చదలవాడ రమణమ్మ ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణానికి చేరుకుని రిజిస్ట్రేన్ చేసుకోవాలని అధికా రులు సూచించారు. ఆ ప్రకారం ఉదయం 7 గంటలకు రిజిస్ట్రేషన్ ప్రారంభించి 10.30 గంటలకు ముగించారు. మొత్తం 1532 మందికిగాను 1506 మంది ప్రయాణానికి రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. అనారోగ్యం, ఇతర కారణాలవల్ల 26 మంది రాలేక అధికారుల అనుమతి తీసుకున్నారు. అభ్యర్థులు, వారి సహాయకులు 3,012 మందితో ఆ ప్రాంగణం రద్దీగా మారింది. ఓపక్క బారులు తీరిన బస్సులు, మరోపక్క వేలాదిమంది అభ్యర్థులు, వారి సహా యకులతో సందడి వాతావరణం నెలకొంది. అల్పాహార పంపిణీ తర్వాత 10.45 గంటల సమయంలో బస్సులు బయలుదేరేందుకు సిద్ధమయ్యాయి. ఆ సమయంలోఓ కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు, తదుపరి కార్యక్రమ తేదీని మళ్లీ ప్రకటిస్తామని అమరావతి నుంచి అధికారులకు సమాచారం వచ్చింది. భారీ వర్షంతో అమరావతిలోని సభా ప్రాంగణంలో నీళ్లు చేరడంతో ఈ కార్యక్రమాన్ని రద్దు చేశారు. కాగా, దారి మధ్యలో 1600 మందికి గూడూరులో, మరో 1600 మందికి నెల్లూరులో భోజన ఏర్పాట్లు చేశారు. ప్రయాణం రద్దుకావడంతో ఆహార పదా ర్థాలు వృథాగా మారాయి.

తిరుమలకు తగ్గిన బస్సులు

తిరుపతి(ఆర్టీసీ), సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ అభ్యర్థుల కోసం ఆర్టీసీ ఉన్నతాధికారులు ఏడు డిపోల నుంచి సప్తగిరి బస్సులను ఎంపిక చేశారు. వీటిలో చాలా వరకు తిరుమలకు వెళ్లే బస్సులే. గురువారం ఉదయం 7 గంటలకే ఈ బస్సులు చదలవాడ రమణమ్మ ఇంజనీరింగ్ కళాశాల వద్దకు చేరాయి. ప్రయాణం రద్దయిందని తెలిసి తిరిగి ఆయా డిపోలకు బస్సులు చేరాయి. మెయింటనెన్స్ చేసుకొని మళ్లీ రోడ్డెక్కె సరికి సాయంత్రమైంది. ఈ మధ్యలో తిరుమలకు బస్సుల ట్రిప్పులు తగ్గాయి.





కార్యక్రమం రద్దవడంతో వెనుదిరిగిన అభ్యర్థులు,సహాయకులు - చిన్నారితో వచ్చిన డీఎస్సీ అభ్యర్థి

అన్నప్రసాద ట్రస్టు కార్పస్ నిధులు
బాగా పెరిగాయ్ : టీటీడీ ఈవో



తిరుమల, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): టీటీడీ అన్న ప్రసాదం నాణ్యత, రుచులపై ప్రపంచవ్యాప్తంగా భక్తుల నుంచి వస్తున్న స్పందన కారణంగా 2024-25 ఆర్థిక సంవత్సరంలో ట్రస్టు కార్పస్ నిధులు చాలా బాగా పెరి గాయని టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ తెలి పారు. తిరుమలలోని వెంగమాంబ అన్నప్రసాద భవ నంలో గురువారం సాయంత్రం ఆయన తనిఖీలు చేప ట్టారు. ఈసందర్భంగా భక్తులతో మాట్లాడి దర్శన సమ యాలు, టోకెన్ విధానం, క్యూలైన్ సౌకర్యాలు, అన్నప్ర సాదం రుచి, తిరుమలలోని వివిధ పాయింట్ల వద్ద అన్నప్రసాదాల పంపిణీ తదతర అంశాలపై సమాచారం సేకరించారు. అలాగే వంటశాల, స్టోర్ రూమ్, జీడిపప్పు బ్లాక్స్‌లను పరిశీలించి అధికారులకు కొన్ని సూచనలు చేశారు. అన్నప్రసాద కేంద్ర సిబ్బంది, శ్రీవారిసేవలకులతో కూడా మాట్లాడారు. అన్నదాన కార్యక్రమం 1985లో ప్రారం భమై, 1994లో అన్నప్రసాదం ట్రస్టుగా ఏర్పడిందన్నారు. 2020 వరకు ఈ కార్యక్రమం నడవడానికి టీటీడీ గ్రాంట్ ఇస్తూ వచ్చిందని, అతర్వాత స్వయం సమృద్ధిని సాధించిం దన్నారు. ఏటా విరాళాలు పెరగుతున్నాయన్నారు. 2023-24లో కార్పస్ రూ.1,854 కోట్లు, 2024-25లో రూ.2127 కోట్లు, 2025 ఆగస్టు వరకు రూ2,263 కోట్లకు చేరిందన్నారు. వడ్డీల రూపంలో 2024లో రూ.221 కోట్లు, 2025లో రూ.270 కోట్లకు పెరిగిందన్నారు. ప్రస్తుత వార్షిక వ్యయం రూ.150 కోట్లు ఉందన్నారు. రూ.కోటి విరాళదా తలు కూడా పెరిగారని, 2023-24లో 14 మంది ఉంటే, 2024-25లో 25 మంది, ఈ సంవత్సరం ఐదు నెలల్లో 14 మంది రూ.కోటికిపైగా విరాళాలు అందజేశారని వివరిం చారు. ప్రస్తుతం తాము వార్షిక బ్రహ్మోత్సవాలపై దృష్టిసా రించామని, భక్తుల అభిప్రాయాలు, ఈ-మెయిళ్లు, డయల్ యువర్ ఈవో, వాట్సాప్, సర్వే, ఐవీఆర్‌ఎస్ ద్వారా వచ్చే సూచనలు వ్యవస్థలో అవసరమైన చోట సవరణలు చేయ డానికి కీలకంగా ఉపయోగపడుతున్నాయన్నారు. ఈతని ఖీల్లో అన్నప్రసాదం డిప్యూటీఈవో రాజేంద్ర, క్యాటరింగ్ ఆఫీసర్ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు ఎర్రచందనం స్మగ్లర్ల అరెస్టు



మంగళం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): తిరు పతి సమీపంలోని మంగళం అటవీ ప్రాంతంలో గురువారం టాస్క్‌ఫోర్సు పోలీసులు కూంబింగ్ నిర్వహించి ఇద్దరు స్మగ్లర్లను అరెస్టు చేసి, ఆరు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఆర్ఐ సాయిగిరిధర్‌కు చెందిన ఆర్ఎస్ఐ విష్ణువర్ధ న్‌కుమార్ మామండూరు నుంచి కరకంబాడీ అటవీ ప్రాంతంలో కూంబింగ్ నిర్వహిస్తూ గురు వారం తెల్లవారుజామున మంగళం సమీపంలోని గ్రాండ్‌వరల్డ్ వెనుక వైపునకు చేరుకున్నారు. కొందరు వ్యక్తులు ఎర్రచందనం దుంగలు మోసుకుని వెళుతూ వారి కంటబడ్డారు. పారిపోయే ప్రయత్నం చేయగా వెంటబడి ఇద్దరిని పట్టుకున్నారు. వారు తమిళనా డుకు చెందిన వారిగా గుర్తించారు. దుంగలతో సహా టాస్క్ ఫోర్సు పోలీస్‌స్టేషన్‌కు తరలించి ఎస్ఐ రఫీ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

హజరత్ నాందేడ్-తిరుచానూరు మధ్య మరో 4 రైలు సర్వీసులు

తిరుపతి(సెంట్రల్), సెప్టెంబరు18(ఆంధ్ర జ్యోతి): తిరుపతిలో నెలకొన్న రద్దీని దృషిలో ఉంచుకుని హజరత్ నాందేడ్-తిరుచానూరు మధ్య మరో 4 సర్వీసులు నడుపుతున్నామని దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో శ్రీధర్ తెలిపారు. ఈ ప్రత్యేక రైళ్లు (07039) నాందేడ్‌లో ఈ నెల 23, 30 తేదీల్లో ఉదయం 8గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 11.40 గంటలకు తిరుచా నూరు రైల్వేస్టేషన్‌కు చేరుకుంటాయి. తిరుచానూరులో ఈనెల 24, అక్టోబరు 1 తేదీల్లో ప్రత్యేక రైలు(07040) సాయంత్రం 6.40 గంటలకు బయలుదేరి మరుసటి రోజు హజరత్ నాందేడ్‌కు చేరుకుంటాయి. ఈ మార్గంలో ప్రయా ణించే ప్రయాణికులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

బ్రిక్స్ స్కిల్ టెక్నాలజీలో కాంస్య పతకం
బ్రెజిల్‌లో మెరిసిన పద్మావతి వర్సిటీ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): బ్రెజిల్‌లో నిర్వహించిన బ్రిక్స్ స్కిల్స్ డెవెలప్‌మెంట్ అండ్ టెక్నాలజీ ఇన్నోవేషన్ కాంపి టేషన్‌లో పద్మావతి మహిళా యూనివర్సిటీ ఇంజినీరింగ్ విభాగ అధ్యాపకు రాలు డాక్టర్ ఎస్.రమాజ్యోతి కాంస్య పతకాన్ని సాధించారు. ఫుడ్ ప్యాకేజిం గ్‌లో బయో ప్యాక్ వ్యవస్థపై ఆమె ప్రదర్శన ఇచ్చారు. కాంస్య పతకాన్ని పొందారు. వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజని, డైరెక్టర్ మల్లికార్జున అభినందించారు.



రమాజ్యోతిని అభినందిస్తున్న వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజని

గ్లోబల్ ఇన్నోవేషన్ క్యాపిటల్‌గా ఏపీ
ఆర్ అండ్ డీ కాన్‌క్లేవ్‌లో డీఆర్‌డీవో మాజీ ఛైర్మన్ సతీష్ రెడ్డి



ఇన్నోవేషన్, ఆర్‌అండ్‌డీ కాన్క్లేవ్‌లో పాల్గొన్న ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణ

తిరుపతి(విద్య), సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): గ్లోబల్ ఇన్నోవేషన్ క్యాపిటల్‌గా మారడానికి ఆంధ్రప్రదేశ్ ముందంజలో ఉందని డీఆర్ డీవో మాజీ ఛైర్మన్ డాక్టర్ జి. సతీష్‌రెడ్డి చెప్పారు. సీఐఐ ఆంధ్రప్రదే శ్ 2వ ఎడిషన్ ఇన్నోవేషన్, ఆర్ అండ్ డి కాన్‌క్లేవ్ స్థానిక ఓ హోటల్లో గురువారం జరిగింది. ముఖ్య అతిథిగా వర్చు వల్‌గా హాజరైన సతీష్‌రెడ్డి మాట్లాడుతూ ప్రపంచానికి అత్యాధునిక ఉత్పత్తులను అందించేలా పనిచేయాలని యువతకు సూచించారు. రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ విభాగం కార్యదర్శి భాస్కర్ కాటంనేని వర్చువల్‌గా మాట్లాడారు. వ్యవస్థాపకతను పెంపొం దించడం, 20వేల స్టార్టప్‌లను సృష్టించడం, రాబోయే ఐదు సంవత్సరాలలో లక్ష ఉద్యోగాలను సృష్టించడం లక్ష్యంగా ప్రభుత్వం ఇన్నోవేషన్ అండ్ స్టార్టప్ పాల సీని ప్రారంభించిందని చెప్పారు. తిరుపతి ఐఐటీ డైరె క్టర్ సత్యనారాయణ అధ్యక్షత వహించారు. సీఐఐ ఆంధ్రప్రదేశ్ గత ఛైర్మన్ డి.రామకృష్ణ, పుష్పిత్ స్టీల్స్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ పుష్పిత్ గార్గ్, విప్రో లిమిటెడ్ ఏఐ గ్లోబల్ డెలివరీ హెడ్ రఘువీరన్, క్యాప్ జెమిని ఇన్వెంట్ సీనియర్ డైరెక్టర్, ఇంటెలిజెంట్ ఇండస్ట్రీస్ మురళి చంద్రహాసన్ పారిశ్రామికవేత్తలు మలార్‌విలి, విజయ్‌కర్వ, వికాస్ నరహరి, డి.దామోదర్‌నాయుడు, నందకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేపు దక్షిణ మధ్య రైల్వే ఎస్‌డీజీఎం పర్యటన

తిరుపతి(సెంట్రల్), సెప్టెంబరు18(ఆంధ్ర జ్యోతి): దక్షిణ మధ్య రైల్వే సీనియర్ డిప్యూటీ జనరల్ మేనేజరు చేతననంద్ సింగ్ శనివారం గుంతకల్లు డివిజన్‌లో పర్యటించ నున్నట్లు రైల్వే అధికార వర్గాలు తెలిపాయి. శుక్రవారం 17652 ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరి శనివారం ఉదయం 3.55 గంటలకు తిరుపతి చేరుకుని రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను తనిఖీ చేస్తారు. 9.15 గంటలకు రేణిగుంట రైల్వే స్టేషన్‌కు చేరుకుని 22158 ఎక్స్‌ప్రెస్‌లో బయలు దేరి 14.10 గంటలకు గుంతకల్లు చేరుకుని సీని యర్ స్కేల్ అదికారులతో సమీక్షిస్తారు. అనం తరం రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరి సికింద్రాబాదుకు చేరుకుంటారు.

స్క్రాబ్ శిల్పానికి.. విగ్రహానికి
తేడా తెలియని భూమన
టీటీడీ మాజీ సభ్యుడు ఓవీ రమణ విమర్శ



తిరుపతి, సెప్టెంబరు18(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డికి మహావిష్ణువు విగ్రహానికి, స్క్రాబ్ శిల్పానికి తేడా తెలియడంలేదని, ఆయనకు నిజంగా హిందూ ధర్మంపై నమ్మకం ఉంటే దాన్ని ఇంట్లో పెట్టుకోవాలని టీటీడీ మాజీ సభ్యుడు ఓవీ రమణ వ్యాఖ్యానించారు. తిరుపతిలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'స్క్రాబ్ శిల్పానికి ఇంట్లో నిత్యకైంకర్యాలు చేయాలి. సంప్రదాయాలు, ఆచారాలతో భూమన వ్యాపారం చేశారు. కార్పొరేట్ దళారులను పెంచి పోషించింది ఆయనే. ఆయన హయాంలో అర్చనానంతర దర్శనం (ఏఏడీ) టికెట్లు విక్రయించి కోట్లు సంపాదించారు. కల్యాణోత్సవం పేరుతో కమీషన్లు నొక్కారు. దేవుడి నగలతో ఎగ్జిబిషన్ పెట్టాలన్న దుర్బుద్ధి ఆయనకే సాధ్యం. కేవలం రాజకీయ లబ్ధికోసం టీటీడీని వాడుకుంటున్నాడు. జగన్ ప్రోద్బలంతోనే టీటీడీపై దుష్ప్రచారం చేస్తున్నాడు. ఆయన బూటకపు మాటలను ప్రజలు నమ్మరు. వెంకటే శ్వర స్వామితో ఆటలాడినవారందరూ తగిన మూల్యం చెల్లించుకున్నారు' అని ఆయన దుయ్యబట్టారు.

బ్రహ్మోత్సవాలకు ముందు అలజడికి భూమన అజెండా
టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి

తిరుమల, సెప్టెంబరు18(ఆంధ్రజ్యోతి): శ్రీవారి బ్రహ్మోత్సవాలకు ముందు అల జడి సృష్టించడానికి భూమన కరుణాకరరెడ్డి రహస్య అజెండాతో ఉన్నారనే అను మానం కలుగుతోందని టీటీడీ సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి అన్నారు. శ్రీవారి ఆలయం ముందు గురువారం మీడియాతో మాట్లాడుతూ, అలిపిరి విగ్రహం ప్రచా రంపై 41 నోటీసు ఇస్తే, 23న వస్తానని చెప్పడం వెనుక ఏదో ఉందనే అనుమానం కలుగుతోందన్నారు. 'శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో పట్టువస్త్రాలు సమర్పించేందుకు 24న సీఎం చంద్రబాబు తిరుమలకు రాబోతున్నారు. ఆ ముందురోజు వస్తానని పోలీసు లకు చెప్పడం వెనుక రహస్య అజెండా ఉండచ్చు' అన్నారు. కరుణాకరరెడ్డి వంటి వ్యక్తిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని భక్తుల నుంచి వరుస ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. ఆయనకు ఎలా బుద్ధి చెప్పాలో టీటీడీకి తెలుసన్నారు.

పంటలపై కొనసాగుతున్న గజదాడులు



కోటపల్లి వద్ద ఏనుగుల దాడుల్లో ధ్వంసమైన మామిడిచెట్లు

కల్లూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో ఏనుగుల గుంపు దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. రోజూ రాత్రివేళల్లో పంటలపై ఏనుగుల గుంపు దాడులు చేస్తుండటంతో మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం రాత్రి మామిడి, వరి, కొబ్బరి, వేరుశనగ, టమోటా తదితర పంటలకు అపారనష్టం వాటిల్లుతోంది. పశ్చిమ విభాగం అటవీ ప్రాంతంలోని పెద్దవంక నుంచి 10 ఏనుగుల గుంపు కల్లూరు పంచాయతీ తలారివారిపల్లెకు చేరుకున్నాయి. కల్లూరుకు చెందిన గంగాధరం, చెంగల్రాయులు, ఇక్బాల్, శ్రీరాములు, జాకీర్‌కు చెందిన మామిడి చెట్లను ధ్వంసం చేశాయి. అనంతరం తిరిగి పెద్ద వంకకు ఏనుగుల గుంపు చేరుకున్నాయి. తూర్పువిభాగ అటవీ ప్రాంతంలోని చింతలవంక నుంచి బయలుదేరిన నాలుగు ఏనుగుల గుంపు కోటపల్లి వద్దకు చేరుకున్నాయి. కోటపల్లిలోని నరసింహులు, నరేశ్, నాగరాజు, రాజా, దాము తదితర రైతులకు చెందిన మామిడిచెట్లు, పశుగ్రాశాన్ని ధ్వంసం చేశాయి. తిరిగి నాలుగు ఏనుగుల గుంపు చింతలవంకలోకి చేరుకున్నాయి. గోగులమ్మ వంక నుంచి బయలుదేరిన ఒంటరి ఏనుగు పాతపేట పంచాయతీ చిట్టారెడ్డిపేట సమీపంలోని గుర్రప్ప, రామకృష్ణకు చెందిన వేరుశనగ, మామిడిచెట్లను ధ్వంసం చేసి తిరిగి పెద్దవంక వద్దకు చేరుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఏనుగుల బారినుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

టీడీపీ మండలాధ్యక్షుల నియామకం



వెంకటేశ్ - రాజగోపాల్ - సుబ్రహ్మణ్యం - ఉదయకుమార్ - వెంకటరమణ

కుప్పం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కుప్పం నియోజకవర్గంలో నాలుగు మండలాలకు టీడీపీ అధిష్ఠానం నూతన అధ్యక్షులను నియమించింది. కుప్పం మున్సిపాలిటీ టీడీపీ అధ్యక్షుడిగా కాణిపాకం వెంకటేశ్ (వన్నెకుల క్షత్రియ) నియమితులయ్యారు. అలాగే కుప్పం మండల టీడీపీ అధ్యక్షుడిగా కురబ కార్పొరేషన్ డైరెక్టర్ రాజగోపాల్ (కురబ), గుడుపల్లె మండల టీడీపీ అధ్యక్షుడిగా సుబ్రహ్మణ్యం (ఎస్సీ), శాంతిపురం మండల టీడీపీ అధ్యక్షుడిగా ఉదయ కుమార్ (కమ్మ), రామకుప్పం మండల టీడీపీ అధ్యక్షుడిగా వెంకటరమణ (వాల్మీకి) నియమితులయ్యారు. ఒక్కో మండలానికి ఒక్కో సామాజిక వర్గానికి ప్రాధాన్యత ఇవ్వడంతో ఈ నియామకాల ద్వారా సామాజిక సమతౌల్యం సాధించినట్లయింది. అంతేకాక బూత్ ఇన్‌చార్జిల నియామకాలతో ప్రారంభమైన కుప్పం నియోజకవర్గ పార్టీ పదవుల నియామకాలు, మండల పార్టీ అధ్యక్షుల నియామకంతో సంపూర్ణమయ్యాయి. ఇక టీడీపీ కుప్పం నియోజకవర్గ అధ్యక్షుడి ఎంపిక మాత్రమే మిగిలింది. కాగా మండల టీడీపీ అధ్యక్షులుగా ఎంపికైన నాయకులకు పార్టీ కార్యకర్తలు, నాయకులు పలువురు గురువారం అభినందనలు తెలిపారు. ఆయా మండల కేంద్రాల్లో కేక్ కట్ చేసి, బాణాసంచా పేల్చి సంబరాలు జరిపారు.

విజయపురం ఎంపీపీ రాజీనామా ఆమోదం



జడ్పీ సీఈవోకు రాజీనామా పత్రం అందిస్తున్న ఎంపీపీ జమున

విజయపురం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): విజయపురం ఎంపీపీ జమున పదవి నుంచి వైదొలిగారు.జడ్పీ సీఈవోకు ఈ నెల 15న అందించిన రాజీనామాను గురువారం ఆమోదించినట్లు సమాచారం. జగన్నాథపురం ఎంపీటీసీ గెలుపొంది నాలుగు సంవత్సరాల మూడు నెలలు ఎంపీపీగా విధులు నిర్వహించి ఉన్నట్టుండి రాజీనామా చేయడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఎంపీపీగా జమున పదవీ బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచీ వివాదరహితంగా అందరితో సానుకూలంగా వ్యవహరించేవారు.ఇప్పుడు ఎంపీపీ స్థానాన్ని ఆశిస్తున్న వారే ఆమె చేత బలవంతంగా రాజీనామా చేయించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.నాలుగేళ్ల క్రితం ఎన్నికలు జరిగినప్పుడు ఎంపీపీ స్థానం జనరల్‌కు కేటాయించినప్పటికీ ఎస్టీ మహిళకు దక్కింది. నగరి నియోజకవర్గంలోని నిండ్ర, విజయపురం, నగరి, పుత్తూరు, వడమాలపేట ఎంపీపీ స్థానాలను అప్పటి మంత్రి ఆర్కే రోజా మహిళలకే కేటాయించాలని నిర్ణయించుకోవడంతో పలువురు ఆశావహులకు ఆశాభంగం కలిగింది.విజయపురం మండలంలో తొమ్మిది ఎంపీటీసీ స్థానాలుంటే వైసీపీ మద్దతుదారులే ఎన్నికయ్యారు.వీరిలో శ్రీహరిపురం ఎంపీటీసీ లక్ష్మీపతిరాజు అసెంబ్లీ ఎన్నికల ముందు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. విజయపురం ఎంపీటీసీ దశరథ ప్రభుత్వ ఉద్యోగం రావడంతో రాజీనామా చేశారు.మిగిలిన ఏడుగురిలో ఎంపీపీ స్థానానికి ఆలపాకం, బూచివానత్తం, కేవీపురం ఎంపీటీసీలు పోటీ పడుతున్నట్టు తెలుస్తోంది.

నానో యూరియాతో ఆరోగ్యం



ఎరువులు పంపిణీ చేస్తున్న జేడీ మురళీ కృష్ణ

చౌడేపల్లె, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): నానో యూరియాతో భూమితో పాటు మానవాళికి ఆరోగ్యకరమని వ్యవసాయ శాఖ జేడీ మురళీ కృష్ణ అన్నారు. గురువారం ఆయన మండలంలోని పలు రైతు సేవా కేంద్రాల్లో యూరియా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 329 రైతు సేవా కేంద్రాల్లో 20,400 బస్తాల యూరియాను పంపిణీ చేసినట్లు తెలిపారు. 22 వేల ఎకరాల పంటలకు సరిపడ 13 మెట్రిక్ టన్నుల యూరియాను ఇప్పటికే సరఫరా చేశామన్నారు. రైతులు నానో యూరియా వాడటం శ్రేయస్కరమన్నారు. కేవలం రూ.225 లకే 500 మిల్లీలీటర్ల నానో యూరియా వస్తుందని, బస్తా యూరియాకు సమానమని సూచించారు. కార్యక్రమంలో ఏడీఏ శివకుమార్, ఏవో మోహన్‌కుమార్, వీహెచ్ఏ నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

4.52లక్షల పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు లక్ష్యం

చిత్తూరు సెంట్రల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 4.52 లక్షల పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నట్లు పశుసంవర్ధక శాఖ జేడీ అబ్దుల్ ఆరీఫ్ తెలిపారు. గురువారం తన చాంబర్‌లో మాట్లాడుతూ.. అవసరమైన టీకాలను జిల్లా వ్యాప్తంగా పశు వైద్య కేంద్రాలకు పంపామన్నారు. నేషనల్ డిసీజ్ కంట్రోల్ ప్రోగ్రామ్‌లో భాగంగా పశువులకు ఉచితంగా టీకాలు వేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటివరకు 10 శాతం లక్ష్యాన్ని పూర్తి చేశామని, నెలాఖరులోపు వంద శాతం పూర్తి చేస్తామని వివరించారు. టీకాలు వేయడం ద్వారా పశువులకు ఎలాంటి అనారోగ్యం ఉండదని, పాల దిగుబడి తగ్గుతుందనే అపోహలు వీడాలని సూచించారు.

ప్రమాదపు అంచులో టీబీ కార్యాలయం

● పెచ్చులూడుతున్న భవనం పైకప్పు, గోడలకు పగుళ్లు



పెచ్చులూడిన టీబీ కార్యాలయ భవనం స్లాబు - పెచ్చులూడిన ఎక్స్‌రే గది - వైద్యాధికారి గదిలో పగుళ్లు కారణంగా ఏర్పడిన చెమ్మ

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో ఉన్న టీబీ కార్యాలయ భవనం ప్రమాదపు అంచులో ఉంది. భవనం పైకప్పు పూర్తిగా పాడై పెచ్చులూడుతోంది. ఇప్పటికే తుప్పు పట్టిన ఇనుపరాడ్లు బయటకు కనిపిస్తున్నాయి. వర్షం కురిసినప్పుడల్లా స్లాబ్ నుంచి నీరు కారుతోంది. టీబీ మెడికల్ ఆఫీసర్ కార్యాలయంలో గోడలకు పగుళ్లు రావడంతో చెమ్మ నిలబడి, కరెంట్ షాక్ కొడుతోందని సిబ్బంది వాపోతున్నారు. ఈ పరిస్థితుల్లో కార్యాలయంలో అధికారులు, వైద్యులు, సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహించాల్సి వస్తోంది. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి.. ఈ భవనానికి మరమ్మతులు చేయించడమో లేదంటే కొత్త భవనం నిర్మించడమో చేయాలి.

ఇళ్ల పట్టాలపై సమగ్ర వివరాలు పంపండి

● తహసీల్దార్లకు డీఆర్వో ఆదేశం

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రభుత్వం తరపున ఇళ్ల పట్టాల మంజూర్లకు సేకరించిన భూవివరాల ఆడిట్ పేరాలకు సమాధానాలు పంపాలని తహసీల్దార్లను డీఆర్వో మోహన్‌కుమార్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని తన చాంబర్ నుంచి ఆర్డీవోలతో కలసి తహసీల్దార్లతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. పుంగనూరులో సర్వేనెంబరు 335/2లో ఇళ్ల పట్టాలకోసం సేకరించిన భూమిని ప్రైవేటు సంస్థలకు అప్పగించాలన్న అంశానికి సంబంధించి వివరణ పంపాలని సూచించారు. పుంగనూరులో 363 మందికి సెంటు భూమి బదులు 1.50 సెంట్ల భూమిని ఎందుకు పంపిణీ చేశారని ప్రశ్నించారు. 452 మంది కోసం 8.22 ఎకరాల భూమి ఇండ్ల పట్టాల కోసం సేకరించగా, కేవలం 246 మందికి మాత్రమే పంపిణీ చేసి, మిగిలిన వారికి ఎందుకు పంపిణీ చేయలేదో కలెక్టరేట్‌కు వెంటనే నివేదిక పంపాలని ఆదేశించారు. చిత్తూరు నగరపాలక కార్పొరేషన్ పరిధిలో అనుపల్లె, బండపల్లె, దొడ్డిపల్లె ప్రాంతాల్లో భూసేకరణ ఎక్కువ చేసి.. తక్కువ మందికి మాత్రమే పంపిణీ ఎందుకు జరిగాయని, కారణాలు తెలపాలని కోరారు. పూతలపట్టు మండలంలో సర్వే నెం.439లో ఒడ్డుపల్లె, పోలవరంలో భూసేకరణ వివరాలను సమర్పించాలని ఆదేశించారు. జిల్లావ్యాప్తంగా ప్రతి మండలంలో ప్రభుత్వ ఉత్తర్వుల మేర గ్రామీణ ప్రాంతాల్లో 1.50 సెంట్ల భూమి పంపిణీ చేయాల్సివుండగా, నిబంధనలకు విరుద్ధంగా తహసీల్దార్లు కొందరికి ఒక సెంటు, మరికొందరికి 1.25 సెంట్లు, మరికొందరికి 1.35 సెంట్ల ఇళ్ల పట్టాల పంపిణీ ఎందుకు చేశారని ప్రశ్నిస్తూ, ఇందుకు సంబంధించిన నివేదికను తహసీల్దార్లనుంచి సేకరించి ఆర్డీవోలు కలెక్టరేట్‌కు పంపాలన్నారు.

గ్రామీణ బ్యాంకు సేవల్లో అంతరాయం

● బ్యాంకు విలీనంతో సాంకేతిక సమస్యలు



యాదమరి గ్రామీణ బ్యాంకులో నిరీక్షిస్తున్న ఖాతాదారులు

యాదమరి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు సేవలు మెయింటనెన్స్ కారణంగా నిలిచిపోవడంతో ఖాతాదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఐదు రోజులుగా నగదు లావాదేవీలు, ఫోన్‌పే, బంగారు తనఖా వంటి సేవలు నిలిచిపోవడంతో అవస్థలు ఎదుర్కొంటున్నారు. గతంలో ఉన్న సప్తగిరి గ్రామీణ బ్యాంకు, రాయలసీమ ప్రగతి బ్యాంక్, ఆంధ్రప్రగతి, చైతన్య గోదావరి, వికాస్ బ్యాంకులను విలీనం చేసి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకుగా మార్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈనెల 11 నుంచి 16వ తేదీ వరకు సేవల నిర్వహణలో అంతరాయం ఏర్పడుతుందని బ్యాంకు ముందుగానే సమాచారం ఇచ్చింది. అయితే గడువు ముగిసినా సెప్టెంబరు 18వ తేదీ అయినా కూడా సేవలు సక్రమంగా లేవని యాదమరిలోని బ్యాంకు వద్దకు ఖాతాదారులు ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా రైతులు, రోజువారీ వ్యాపార లావాదేవీలు చేసేవారికి తీవ్ర నష్టం కలిగిస్తోందని తెలిపారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని బ్యాంకు సిబ్బంది చెబుతున్నారు. ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించే ఏర్పాట్లలో భాగంగానే అంతరాయం ఏర్పడిందని మేనేజర్ రాజేంద్ర వివరించారు.

పరిశ్రమల ఏర్పాటుకు స్థల పరిశీలన



రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్

శ్రీరంగరాజపురం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): శ్రీరంగరాజపురం మండలంలో పరిశ్రమల ఏర్పాటు కోసం స్థల పరిశీలన చేసేందుకు కలెక్టర్ సుమిత్ కుమార్ గురువారం వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ గంగాధర నెల్లూరు నియోజకవర్గంలో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు ఎమ్మెల్యే థామస్ అభ్యర్థన మేరకు రాష్ట్రప్రభుత్వం ఏపీఐఐసీ ద్వారా స్థల పరిశీలన చేయిస్తోందన్నారు. ఎస్ఆర్‌పురం మండలం, పాతపాళ్యం, 56-కన్నికాపురం, జీ.ఎం.ఆర్ పురం రెవిన్యూ గ్రామాల్లో 1000 ఎకరాల డీకేటీ మరియు ప్రైవేట్ భూముల సేకరణకు స్థల పరిశీలన చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా రైతులతో చర్చించడం జరిగిందన్నారు. భూముల సేకరణ విషయమై మరిన్ని సార్లు పరిశీలన చేయవలసి ఉందన్నారు. ఏపీఐఐసీ జడ్ఎం సుబ్బారావు, తహసీల్దార్ లోకనాథ పిళ్లై, ఏవో మోహన మురళి, టీడీపీ నాయకులు పైనేని మురళి, బాలాజీ నాయుడు, భాస్కర నాయుడు, రవి, జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మా సమస్యలు పరిష్కరించాలి

● ఎస్ఈ కార్యాలయం ఎదుట విద్యుత్ ఉద్యోగుల ధర్నా



చిత్తూరు రూరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం మధ్యాహ్నం భోజన విరామంలో ఎస్ఈ కార్యాలయం ఎదుట విద్యుత్ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ.. ఉద్యోగులకు, పెన్షనర్లకు.. వారి కుటుంబీకులకు పూర్తి వైద్య ఖర్చులు ప్రభుత్వమే చెల్లించాలని కోరారు. జేఎల్ఎం గ్రేడ్-2 లను రెగ్యులర్ ఉద్యోగులుగా పరిగణించి.. వేతనాలు, ప్రయోజనాలు కల్పించాలని విన్నవించారు. సమస్యలను పరిష్కరించకుంటే ధర్నా కార్యక్రమాలను కొనసాగిస్తామని హెచ్చరించారు. జేఏసీ నాయకులు కృష్ణయ్య, యజ్ఞనేశ్వర్, దేవేంద్ర, వివేకానందరెడ్డి, చంద్రశేఖర్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

నేడు మెగా ఉద్యోగ మేళా

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఉపాధి కార్యాలయంలో శుక్రవారం మెగా ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి పద్మజ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు ప్రముఖ కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. టెన్త్, ఇంటర్, డిప్లొమా, ఐటీఐ, డిగ్రీ, ఎంబీఏ, ఎంకాం, పీజీ, డీ, బీ ఫార్మసీ పూర్తి చేసిన వారు అర్హులన్నారు. ఉదయం 10.30 గంటలకు ఇంటర్వ్యూలు ప్రారంభమవుతాయని, ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.10వేల నుంచి రూ.27వేల వరకు జీతం ఇవ్వనున్నట్లు వివరించారు.

యూరియాపై రైతులు ఆందోళన పడొద్దు: కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ఆర్ఎస్‌కేల ద్వారా యూరియా పంపిణీ చేపడుతున్నామని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. చిత్తూరు, పూతలపట్టు, గంగాధరనెల్లూరు, కుప్పం, పలమనేరు, పుంగనూరు, నగరి నియోజకవర్గాల పరిధిలో గురువారం నాటికి 125 క్లస్టర్లలో 3293 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు ఉన్నాయని పేర్కొన్నారు. ప్రస్తుతమున్న నిల్వలు రైతుల అవసరాలకు సరిపోతాయని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వివరించారు. అవసరమైతే మరిన్ని యూరియా బస్తాలు జిల్లాకు తెప్పించడం జరుగుతుందన్నారు. గత ఏడాది 45వేల హెక్టార్లలో పంటలు పండించగా, 15వేల మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు పంపిణీ చేశామన్నారు. రైతులు సైతం పండించే పంటను బట్టి మాత్రమే యూరియా వాడాలని ఆ ప్రకటనలో సూచించారు.

మూరేవాండ్లపల్లెలో ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్




ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్‌కు వివరాలు చెబుతున్న డాక్టర్ దినేష్‌కుమార్

రొంపిచెర్ల, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : రొంపిచెర్ల మండలం చెంచమరెడ్డిగారిపల్లె పంచాయతీకి గురువారం చిత్తూరు అపోలో ఆస్పత్రి ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్ వచ్చింది. వైద్యాధికారి హేమలత ఆధ్వర్యంలో మూరేవాండ్లపల్లె, బండకిందపల్లె, చెంచమరెడ్డిగారిపల్లెల్లో ప్రజలనుంచి రక్తనమూనాలు సేకరించారు.వైద్య పరీక్షలు చేశారు. వైద్యాధికారి దినేష్‌కుమార్‌నాయక్ కథనం ప్రకారం... బండకిందపల్లె సచివాలయంలో హార్టికల్చర్ సెక్రటరీగా పనిచేస్తున్న, మూరేవాండ్లపల్లెకు చెందిన పి.నరసింహులుకు ఆగస్టు నెలలో తీవ్ర జ్వరం వచ్చింది.విపరీతంగా కడుపునొప్పి కూడా రావడంతో తిరుపతి వెళ్లి పరీక్షలు చేయించుకోగా సీటీ స్కాన్‌లో పిత్తాశయం వాచిందని తెలిసింది. దీంతో మెరుగైన చికిత్స కోసం వేలూరు సీఎంసీ ఆస్పత్రికి వెళ్లి పరీక్షలు చేయించగా మెలియోయిడోసిస్ వ్యాధిగా నిర్ధారించారు. చికిత్స తరువాత ఆయన ఆరోగ్య పరిస్థితి బాగుంది. వానాకాలం బురదలో ఎక్కువగా పనులు చేసే వారికి ఈ వ్యాధి అరుదుగా వస్తుంటుంది.అలాగే కాళ్లకు గాయాలున్నప్పుడు చెప్పులు లేకుండా తిరిగేవారికి ఈ వ్యాధికారక క్రిములు గాయాల ద్వారా శరీరంలోకి ప్రవేశించి హాని కల్గిస్తాయి.ఈ విషయాన్ని రొంపిచెర్ల ప్రాథమిక వైద్యాధికారి దినేష్‌కుమార్ నాయక్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారులకు తెలియజేశారు. ఈ నేపథ్యంలో గురువారం మూరేవాండ్లపల్లె చుట్టుపక్కల గ్రామాల్లో రాపిడ్ రెస్పాన్స్ టీమ్ సర్వే చేపట్టింది.నరసింహులు కుటుంబ సభ్యులతో పాటు చుట్టుపక్కలున్నవారి రక్త నమూనాలు సేకరించారు.

గజదాడుల నివారణకు కృషి

\- డీఎఫ్‌వో సుబ్బరాజు



చిత్తూరు సెంట్రల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రధాన సమస్యగా మారిన ఏనుగుల దాడుల నివారణకు చర్యలు తీసుకుంటానని డీఎఫ్‌వో సుబ్బరాజు అన్నారు. గురువారం స్థానిక అటవీ జిల్లా కార్యాలయంలో డీఎఫ్‌వోగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు సొంత జిల్లాకు డీఎఫ్‌వోగా రావడం తన అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. మూడు రాష్ట్రాలకు సరిహద్దు అటవీ ప్రాంతంగా జిల్లా ఉండటంతో ఏనుగుల సమస్య అధికంగా ఉందన్నారు. ఈ సమస్యకు అందరి సహకారంతో ప్రణాళికబద్ధంగా చర్యలు తీసుకుంటానని స్పష్టం చేశారు. కుంకీల ఆపరేషన్ సైతం సమర్థవంతంగా నిర్వహిస్తామన్నారు. ఏనుగులను కాపాడుకుంటూనే, అటవీ సరిహద్దు ప్రాంతాల పరిరక్షణకు చర్యలు తీసుకుంటామని వివరించారు. కాగా, కోడూరు సబ్ డీఎఫ్‌వోగా పనిచేస్తున్న ఈయన్ను ప్రభుత్వం చిత్తూరు డీఎఫ్‌వోగా బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఇక్కడ డీఎఫ్‌వోగా పనిచేస్తున్న భరణిని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్‌కు మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమించడంతో ఆమె గురువారం డీఎఫ్‌వోగా రిలీవ్ అయ్యారు. భరణికి శాఖాపరంగా పలమనేరు సబ్ డీఎఫ్‌వో వేణుగోపాల్, ఈస్టు ఎఫ్ఆర్వో థామస్ సుకుమార్, వెస్టు ఎఫ్ఆర్వో పట్టాభి, కార్వేటినగరం, పలమనేరు, పుంగనూరు, కుప్పం ఎఫ్ఆర్వోలు వెంకటసుబ్బయ్య, నారాయణ, శ్రీరాములు, జయశంకర్ తదితరులు ఘనంగా వీడ్కోలు పలికారు.

'యంగ్ లీడర్స్ డైలాగ్' క్విజ్ పోటీలకు నమోదు చేసుకోండి

● మైభారత్ జిల్లా యువజన అధికారి ప్రదీప్‌కుమార్



చిత్తూరు సెంట్రల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'యంగ్ లీడర్స్ డైలాగ్' క్విజ్ పోటీలకు డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్ కళాశాలల్లోని విద్యార్థులు నమోదు చేసుకోవాలని మైభారత్ జిల్లా యువజన అధికారి ప్రదీప్‌కుమార్ పిలుపునిచ్చారు. గురువారం తన కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. దేశవ్యాప్తంగా ఈ పోటీలకు 10వేల మంది యువత నమోదు చేసుకునే అవకాశం ఉందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 215 మంది నమోదు చేసుకున్నారని చెప్పారు. www.MYBharat.gov.in ద్వారా మరింత మంది నమోదు చేసుకోవాలని కోరారు. క్విజ్ పోటీల్లో ఎంపికైన వారికి ఎస్ఏ రైటింగ్ పోటీలు నిర్వహిస్తారని, అక్కడ విజేతలైన వారికి డిబేట్ ఉంటుందన్నారు. ఈ ప్రక్రియలో ఎంపికైనవారు ప్రధాని మోదీ నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొంటారని వివరించారు. ఈనెల 8న నుంచి మొదలైన ఆన్‌లైన్ ప్రక్రియ అక్టోబరు 31వ తేదీ వరకు ఉంటుందన్నారు. జిల్లాలో యూత్ క్లబ్‌లు 690 ఉన్నాయని, మరిన్ని గ్రూపులు చేయడానికి మై భారత్ సిద్ధంగా ఉందన్నారు. యువకులు ఈ గ్రూపులు చేసుకుని, మీ ప్రాంతాల్లో అభివృద్ధికి, సేవా కార్యక్రమాలు చేయడానికి వీలు కల్పిస్తామని తెలియజేశారు.

ముగిసిన బార్ల లాటరీ ప్రక్రియ



లాటరీ తీస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు సిటీ, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కొత్తగా ఏర్పాటు చేయనున్న బార్లకు కలెక్టర్ సుమిత్ కుమార్ లాటరీ తీశారు. గురువారం కలెక్టరేట్‌లో టెం దరుదారుల సమక్షంలో చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలో ఒకటి, పలమనేరు మునిసిపాలిటీ పరిధిలో ఒక బార్‌కు లాటరీ తీశారు. గత నెల ప్రభుత్వం జిల్లాలో కొత్తగా ఏర్పాటు చేయనున్న 11 బార్లకు దరఖాస్తులు ఆహ్వానించింది. అందులో మొదటి విడతలో ఐదు బార్లకు మాత్రమే దరఖాస్తులు రాగా లాటరీ ద్వారా కేటాయింపులు జరిగాయి. మిగిలిన ఆరు బార్లకు రెండో విడతలో దరఖాస్తులు ఆహ్వానించారు. వాటిలో రెండు బార్లకు దరఖాస్తులు రాగా, లాటరీ ద్వారా కేటాయించారు. కార్యక్రమంలో ఈఎస్ శ్రీనివాస్, సీఐలు శ్రీహరి రెడ్డి, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

మహిళా పాడిరైతులను ప్రోత్సహించాలి: కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): మహిళా పాడి రైతులను ప్రోత్సహించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని మీటింగ్‌హాలులో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలో భాగంగా స్వయం సహాయకసంఘాల మహిళలు, జీవనోపాదుల అభివృద్ధి, వార్షిక రుణప్రణాళికపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమన్వయ సమావేశం నిర్వహించారు. జిల్లాలో మహిళా పాడిరైతులను గుర్తించి, వారు ఆర్థికంగా అభివృద్ధి చెందేవిధంగా ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. వ్యవసాయరంగంలో మహిళలకు డ్రోన్ వినియోగంపై విస్తృతంగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. నగరి, విజయపురం, కార్వేటినగరం, శ్రీరంగరాజపురం మండలాల్లో మహిళా రైతులకు ఉద్యాన పంటలపై ఆసక్తి కలిగేలా చర్యలు చేపట్టాలని చెప్పారు. టిష్యూ కల్చర్ ద్వారా అరటి, బొప్పాయి పంటలపై అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

166 టన్నుల బియ్యానికి 23న వేలం: జేసీ

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రజాపంపిణీ వ్యవస్థకు సంబంధించిన బియ్యాన్ని అక్రమ రవాణా చేస్తుండగా 166 టన్నులను సీజ్ చేశామని జేసీ విద్యాధరి తెలిపారు. ఈ బియ్యానికి ఈనెల 23వ తేదీన కలెక్టరేట్‌లో బహిరంగ వేలం జరుగుతుందని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 6ఏ కేసులు నమోదు చేసి సీజ్ చేసిన బియ్యం ఆయా ఎంఎల్ పాయింట్ల వద్ద ఉన్నాయని చెప్పారు. ఎంఎల్ పాయింట్ల వారీగా కుప్పంలో 7.650 టన్నులు, శాంతిపురంలో 34, పుంగనూరులో 9.534, చిత్తూరులో 92.675, నగరిలో 21.973 టన్నుల బియ్యాన్ని బహిరంగ వేలం వేస్తామని వివరించారు. ఆసక్తిఉన్నవారు రూ.లక్ష ధరావత్తును ఎస్బీఐ గిరింపేట బ్రాంచ్ ద్వారా డీడీ తీయాలన్నారు. కమర్షియల్ ట్యాక్స్ డిపార్ట్‌మెంట్‌లో జీఎస్టీ లైసెన్సు కల్గిన ట్రేడర్లు, రైస్‌మిల్లర్లు మాత్రమే అర్హులని తెలియజేశారు. సరుకులను ఎంఎల్ పాయింట్లలో వేలంపాటదారులు పరిశీలించడానికి అనుమతిస్తారన్నారు. వేలం పాడినవారు రవాణా, హమాలీ ఖర్చులను భరించి, పాడిన రుసుం చెల్లించి 15 రోజుల్లోగా ఎంఎల్ పాయింట్ల నుంచి బియ్యాన్ని తీసుకెళ్లాలని తెలిపారు.

ఆటోనగర్ నిర్మాణానికి సహకరించండి



ప్రేమ్‌కుమార్, రాజ్‌కుమార్‌లకు వినతిపత్రం సమర్పిస్తున్న కార్మిక నాయకులు

కుప్పం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కుప్పంలో ఆటోనగర్ నిర్మాణానికి సహకరించాలని కార్మిక సంఘాల నాయకులు కోరారు. స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గురువారం వారు, ఏపీఐఐసీ డైరెక్టర్‌గా నూతనంగా నియమితులైన ప్రేమ్‌కుమార్‌ను ఘనంగా సత్కరించారు. ఆయనతోపాటు కడా రాజకీయ సలహా మండలి సభ్యుడు రాజ్‌కుమార్‌ను వారు కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఎన్నో ఏళ్లగా పెండింగులో ఉన్న ఆటోనగర్ వెంటనే నిర్మాణమయ్యేలా చర్యలు తీసుకోవాలని వారిని కోరారు. ఈమేరకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ప్రేమ్‌కుమార్, రాజ్‌కుమార్‌లు మాట్లాడుతూ ఇప్పటికే ఆటో నగర్ ఏర్పాటుకు స్థలం చూశామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి కార్మికుల సమస్యలు తీసుకునివెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్మిక సంఘం అధ్యక్షుడు శివకుమార్, నాయకులు రమణ, హరియాదవ్, ఇస్మాయిల్, అబ్దుల్ మునాఫ్, శివ పాల్గొన్నారు.

టీడీపీ బలోపేతానికి కృషి చేయండి



టీడీపీ అధ్యక్షులను సన్మానిస్తున్న పీఎస్ఎం తదితరులు

కుప్పం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కుప్పం నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు నూతనంగా టీడీపీ అధ్యక్షులుగా ఎంపికైన నాయకులు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం అన్నారు. కుప్పం మున్సిపల్, కుప్పం మండల టీడీపీ అధ్యక్షులుగా నియమితులైన కాణిపాకం వెంకటేశ్, రాజగోపాల్ గురువారం పీఎస్ఎంను కలిసి ఆయన ఆశీర్వాదాలు తీసుకుని సత్కారం చేశారు. అలాగే పీఎస్ఎం వారిద్దరినీ పూలమాలలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరం ప్రజల్లో ఉంటూ వారి సమస్యలను అధికారుల దృష్టికి ఎప్పటికప్పుడు తీసుకుని వెళ్లి పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతులకు అండగా చంద్రబాబు



యూరియా పంపిణీ చేస్తున్న మునస్వామి తదితరులు

రామకుప్పం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైతులకు సీఎం చంద్రబాబు అండగా నిలుస్తున్నారని గ్రంథాలయ పరిషత్ రాష్ట్ర డైరెక్టరు మునస్వామి తెలిపారు. గురువారం ఆయన రామకుప్పం మండలం బల్ల గ్రామసచివాలయంలో రైతులకు యూరియా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఎప్పుడు ఇబ్బందులు తలెత్తినా సీఎం సత్వరం స్పందించి వారిని ఆదుకుంటున్నారన్నారు. రాష్ట్రంలో యూరియా కొరత తీరేలా కేంద్రం నుంచి విరివిగా యూరియా తెప్పించారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

103 మందికి చికిత్సలు

రామకుప్పం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం విజలాపురం ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారి పూజిత ఆధ్వర్యంలో గురువారం బల్ల గ్రామంలో స్వస్తినారి సశక్తి పరివార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 103 మంది రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి చికిత్సలందించారు. అనంతరం జరిగిన సమావేశంలో గ్రంథాలయ పరిషత్ రాష్ట్ర డైరెక్టరు మునస్వామి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా మార్చాలన్నదే లక్ష్యంగా కృషి చేస్తున్నారన్నారు. కుప్పం నియోజకవర్గంలో సంజీవని పథకంతో ప్రజలకు ఉచిత వైద్యసేవలను చేరువలోకి తెస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ వెంకట్రామగౌడు, నేతలు రామ్మూర్తి, జయశంకర్, శ్రీనివాసులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

యూరియాపై అసత్య ప్రచారాలు మానండి



రైతులకు యూరియా పంపిణీ చేస్తున్న టీడీపీ నేతలు

వి.కోట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రైతులకు యూరియా అందుబాటులో లేదంటూ వైసీపీ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని మానుకోవాలని మండల టీడీపీ అధ్యక్షులు రంగనాథ్ అన్నారు. గురువారం మండల పరిధిలోని కుంభార్లపల్లె, ఓగు, చింతమాకులపల్లె, పాముగానిపల్లె, కొంగాటం, పడిగలకుప్పం, గోనుమాకులపల్లె రైతు సేవా కేంద్రాల్లో రైతులకు యూరియా బస్తాలను పంపిణీ చేశారు. ఏవో అప్పోజీ, సింగిల్ విండో అధ్యక్షులు నారాయణస్వామి, హరినాథరెడ్డి, మండల పార్టీ కార్యదర్శి ఈశ్వర్, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి రాంబాబు, చౌడప్ప, నాగరాజు, సుబ్రమణ్యంశెట్టి, గోవిందప్ప, అక్బర్, గణపతి, నాగరాజ్ పాల్గొన్నారు.

యూరియా పంపిణీ తనిఖీ



ఉలవలదిన్నె సచివాలయం వద్ద యూరియా కోసం వేచి ఉన్న రైతులు

పుంగనూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు మండలంలోని 13 సచివాలయాల్లో గురువారం యూరియా పంపిణీ చేశారు. మండలంలోని చదళ్ల సచివాలయంలో యూరియా పంపిణీ కార్యక్రమాన్ని చిత్తూరు వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ మురళీకృష్ణ, పుంగనూరు ఏడీఏ శివకుమార్‌రాజు, ఏవో జ్యోతి పరిశీలించారు.

ఉపాధి హామీలో ఉపయోగకర పనులు చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆనందరెడ్డి

రామకుప్పం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీలో గ్రామాల్లో ప్రజా ఉపయోగకర పనులు చేపట్టాలని టీడీపీ మాజీ మండలాధ్యక్షులు ఆనందరెడ్డి, ప్రధాన కార్యదర్శి నరసింహులు కోరారు. గురువారం స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ పారదర్శకంగా పనులు చేపట్టాలని సూచించారు. ఎలాంటి అక్రమాలకు తావివ్వరాదన్నారు. సమావేశంలో రెస్కో వైస్‌చైర్మన్ విశ్వనాథ్, సింగిల్‌విండో చైర్మన్ మహ్మద్‌రఫీ, క్లస్టర్ ఇన్‌చార్జి రవిరెడ్డి, కడ సలహా సభ్యుడు రఘు, ఏపీవో గణేష్, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు వెంటనే నిలిపివేయాలి



నిర్మాణానికి సంబంధించిన పత్రాలను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ ఎస్.వి.రమణారెడ్డి

పలమనేరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు మున్సిపాలిటీ పరిధిలో నిర్మాణ అనుమతులు లేకుండా నిర్మిస్తున్న భవన నిర్మాణాలను వెంటనే నిలుపుదల చేయాలని పలమనేరు మున్సిపల్ కమిషనర్ ఎస్.వి.రమణారెడ్డి సూచించారు. గురువారం పలమనేరు లో నిర్మాణంలో ఉన్న పలు ఇళ్లను కమిషనర్ తమ సిబ్బందితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా నిర్మాణంలో ఉన్న ఇళ్లకు సంబంధించి అనుమతులు తీసుకున్నారా.. లేదా అన్న వివరాలను అడిగి తెలుసుకొన్నారు. కొందరు మున్సిపల్ అనుమతులతో ఇళ్లు నిర్మిస్తుండగా పలువురు అనుమతులు లేకుండా నిర్మాణాలు చేస్తున్న విషయాన్ని గుర్తించి వెంటనే పనులు నిలిపి వేయాలని సూచించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గత జూన్ 30 నాటికి రిజిస్ట్రేషన్ కాబడిన అనధికార లే అవుట్లు, ప్లాట్లు క్రమబద్ధీకరించుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. లే అవుట్లు వేసిన వారు తప్పనిసరిగా 30 అడుగుల రోడ్డును కలిగి ఉండాలన్నారు. మురుగునీటి కాలువల నిర్మాణం, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక వసతుల కల్పనకు వీలుగా ప్లాట్లు నిర్ణీత గడువు లోపు క్రమబద్ధీకరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టీపీవో ఇందిర, రెవెన్యూ అధికారి అనిల్‌కుమార్, వార్డు ప్లానింగ్ సెక్రటరీలు పాల్గొన్నారు.

దివ్యాంగులందరికీ ప్రభుత్వ పథకాలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

పలమనేరు, సెప్టెంబరు 18 (ఆంధ్ర జ్యోతి): అర్హులైన దివ్యాంగులందరికీ ప్రభుత్వ పథకాలు తప్పనిసరిగా అందుతాయని సమగ్రశిక్ష ఏపీసీ మద్దిపట్ల వెంకటరమణ పేర్కొన్నారు. గురువారం పలమనేరులో దివ్యాంగ విద్యార్థులకు వైద్యనిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. శిబిరంలో 90 మంది దివ్యాంగ విద్యార్థులకు వైద్య పరీక్షలు చేపట్టారు. కార్యక్రమంలో ఎంఈవో బాలసుందరం, సహితవిద్య సమన్వయకర్త జగ్గుమధు, ప్రధానోపాధ్యాయులు షాబ్జి, భవిత సిబ్బంది, దేవేంద్ర పాల్గొన్నారు.

పరకామణికి సామగ్రి అందజేత



పూసల రవి, కుమార వర్ధన్‌కు టీటీడీ ప్రసాదాలు అందిస్తున్న పరకామణి సూపరింటెండెంట్ రమేష్

పలమనేరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : తిరుమలలో శ్రీవారి పరకామణి లెక్కించేందుకు వినియోగించే రూ.30 వేలు విలువైన ట్రేలు, ఇతర సామగ్రిని పరకామణి సూపరింటెండెంట్ రమేష్‌కు రాష్ట్ర సంచార జాతులు, దాసరి రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షులు పూసల రవి అందజేశారు. ఈ సందర్భంగా పూసల రవి, ఆయన కుమారుడు కుమార వర్ధన్‌కు స్వామి వారి ప్రసాదాలను అందించారు.

పెరటి కోళ్లతో ఆర్థికాభివృద్ధి



కోళ్లకు టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి చందనప్రియ

సోమల, సెప్టెంబరు 18 (ఆంధ్ర జ్యోతి): పెరటి కోళ్ల పెంపకంతో ఆర్థికాభివృద్ధి సాధించాలని సోమల పశుసంవర్ధక శాఖ ఏడీహెచ్ శ్రీనివాసులు నాయుడు తెలిపారు. గురువారం కందూరు పశువైద్యశాలలో పెరటి కోళ్ల పెంపకం, వ్యాధి నివారణ చర్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పశువైద్యాధికారి చందనప్రియ పెరటి కోళ్లకి కొక్కెర తెగులు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ప్రతి గురువారం ప్రతి పశువైద్యశాలలో కొక్కెర తెగులు వ్యాధి నివారణ టీకాలు వేయనున్నట్లు తెలిపారు. ఈవ్యాధి సోకిన కోళ్లల్లో తల తిప్పడం, కళ్ల వాపు రావడం, ఆకస్మిక మరణశాతం ఎక్కువగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, మాజీ ఎంపీటీసీ సభ్యులు పి.శ్రీనివాసులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వృద్ధుడి మృతి

చౌడేపల్లె, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): చౌడేపల్లె మండలంలోని పుదిపట్ల పంచాయతీ అమరకృష్ణపురానికి చెందిన గోపాల్(84) ఇంట్లో స్విచ్ వేయడంతో విద్యుత్ షాక్ కు గురయ్యాడు. కుటుంబ సభ్యులు 108 వాహనంలో పుంగనూరు ఆస్పత్రికి తరలించి చికిత్సలు అందించేలోపు మృతి చెందాడు.

ఆటో ఢీకొనడంతో ముగ్గురికి గాయాలు

పుంగనూరు రూరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు మండలం బరిణేపల్లి వద్ద గురువారం అతివేగంగా వస్తున్న ఆటో ఎదురుగా వచ్చే ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో ముగ్గురు గాయపడినట్లు సీఐ సుబ్బరాయుడు తెలిపారు. మండలంలోని ఏడూరుకు చెందిన శ్రీనాథ్ (17), ప్రసాద్(18), ఆకాశ్(17)లు ద్విచక్ర వాహనంలో పుంగనూరుకు వస్తుండగా ఆటో ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని స్థానికులు గమనించి పుంగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి వైద్య చికిత్సలు అందించగా మెరుగైన వైద్యం కోసం మదనపల్లెకు తీసుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు ప్రత్యేక అవసరాల పిల్లలకు వైద్య నిర్ధారణ పరీక్షలు

సదుం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): సదుం జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో పుంగనూరు నియోజకవర్గ స్థాయిలో ప్రత్యేక అవసరాల పిల్లలకు వైద్య నిర్ధారణ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఎంఈవోలు నటరాజన్, దామోదర గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శిబిరానికి వచ్చే వారు తమ ఆధార్, రేషన్, యూనిక్ ఐడీ కార్డులు, సదరన్ సర్టిఫికెట్, ఫొటోలు తీసుకురావాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం ఫోన్‌నంబర్ 9989976530ను సంప్రదించాలని కోరారు.

తల్లీబిడ్డల సంరక్షణతో ఆరోగ్య సమాజం



పీఈఎస్‌లో అభియాన్ కరపత్రాలు ఆవిష్కరిస్తున్న వైద్య ప్రముఖులు

కుప్పం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): తల్లీబిడ్డలను ఎటువంటి ఆరోగ్య సమస్యలు లేకుండా సంరక్షించుకుంటేనే సమాజం ఆరోగ్యంగా ఉంటుందని పీఈఎస్ ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్‌కే.సుబ్రహ్మణ్య అన్నారు. పీఈఎస్ ఆస్పత్రి గర్భిణుల అవుట్ పేషెంట్ విభాగంలో గురువారం 'స్వస్థ నారి, శక్తివంత కుటుంబ అభియాన్' ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుబ్రహ్మణ్య మాట్లాడుతూ తల్లీబిడ్డల సంక్షేమాన్ని, ఆరోగ్యాన్ని పరిరక్షించేందుకు తమ ఆస్పత్రి కట్టుబడి ఉందన్నారు. ప్రసూతి, స్త్రీ రోగ శాస్త్రం విభాగాధిపతి డాక్టర్ ఎస్.ప్రదీప్ మాట్లాడుతూ మహిళల ఆరోగ్యం, శ్రేయస్సుపై విశ్లేషణాత్మక ప్రసంగం చేశారు. కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ చిత్రా నాగరాజ్ మాట్లాడుతూ మహిళలు, పిల్లలు దేశాభివృద్ధిలో కీలకపాత్ర వహిస్తారన్నారు. వారి శ్రేయస్సుకోసం సమిష్టి కృషి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో అసోసియేట్ ప్రొఫెసర్, అభియాన్ నోడల్ అధికారి డాక్టర్ అనిల్, అసిస్టెంట్ ప్రొఫెసర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ మెల్విన్ డేవిడ్, అధ్యాపకులు, విద్యార్థులు, గర్భిణులు పాల్గొన్నారు.

● కుప్పం మండలం కొత్తఇండ్లు గ్రామంలో గురువారం ఎన్.కొత్తపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో స్వస్థ నారీ, శక్తివంతమైన కుటుంబం అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఆరోగ్య కేంద్రం నోడల్ అధికారి డాక్టర్ సుభాష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గర్భిణులకు పలు వ్యాధులు, టీకాలపై అవగాహన కల్పించారు. వైద్యాధికారి డాక్టర్ సుధారాణి, ఎన్‌వీబీడీసీసీపీ ముత్తు కుమార్, వైద్య ఆరోగ్య సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దలు, బిడ్డల తల్లులు, గర్భిణులు, కిశోర బాలికలు, వృద్ధులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఉదయం పోర్టల్‌లో రిజిస్ట్రేషన్లు చేసుకోవాలి



మాట్లాడుతున్న పరిశ్రమలశాఖ ఏడీ వెంకటరెడ్డి

పుంగనూరు రూరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మహిళలు చిన్నచిన్న పరిశ్రమల స్థాపనకు ఉదయం పోర్టల్‌లో రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని చిత్తూరు పరిశ్రమలశాఖ ఏడీ వెంకటరెడ్డి అన్నారు. గురువారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో పుంగనూరు పట్టణం, నియోజకవర్గంలోని ఎస్‌హెచ్‌జీ గ్రూపు మహిళలకు ఉదయం రిజిస్ట్రేషన్లపై ఆయన అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తపరిశ్రమలు ఏర్పాటు, చిన్న చిన్న పరిశ్రమలు, ఉన్న పరిశ్రమల విస్తరణకు ఉదయం రిజిస్ట్రేషన్లతో కేంద్రప్రభుత్వం అందించే ప్రయోజనాలు వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మధుసూదనరెడ్డి, మెప్మా, డీఆర్‌డీఏ, సచివాలయ అధికారులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మహిళలకు ప్రాథమిక వైద్య పరీక్షలు



సదుంలో ర్యాలీలో పాల్గొన్న వైద్య సిబ్బంది



కార్యక్రమంలో మాట్లాడుతున్న టీడీపీ జిల్లా రైతు ప్రతినిధి రమేశ్‌నాయుడు

సదుం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా చెరుకువారిపల్లె పీహెచ్‌సీ వైద్య సిబ్బంది మండల పరిధిలోని విలేజ్ హెల్త్ కేంద్రాల్లో గురువారం మహిళలు, పిల్లలకు ప్రాథమిక ఆరోగ్య వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్య పరీక్షలతోపాటు మాతా శిశు సంరక్షణ, వ్యాధి నిరోధక టీకాలు, ప్రధాన మంత్రి జన్ ఆరోగ్య యోజన తదితర అంశాలపై అవగాహన కల్పించారు. పురవీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు గాయత్రి, చరణ్, ఆరోగ్య పర్యవేక్షకులు నీలకంఠ, జానకి శిఖామణి, కమ్యూనిటీ హెల్త్ అధికారులు రషీద్, దీప, మనీషా, శివాని, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

● **సోమల:** మహిళల ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ జిల్లా రైతు ప్రతినిధి, మాజీ ఎంపీటీసీ సభ్యులు రమేశ్‌నాయుడు తెలిపారు. గురువారం శీలంవారిపల్లెలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో డాక్టర్ జయసింహ, డాక్టర్ ప్రదీప్‌రెడ్డి మహిళలకు పలు పరీక్షలు నిర్వహించారు. రక్తపోటు, మధుమేహం, నోటి క్యాన్సర్, గర్భాశయ పరీక్షలు చేపట్టారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మునీశ్వరరావు, సీహెచ్‌వో అమరనాథ్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలతోనే మానసికోల్లాసం



మాట్లాడుతున్న ఎంఈవో పోకల తాతయ్య

కల్లూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): క్రీడలతోనే మానసికోల్లాసం సాధ్యమని పులిచెర్ల ఎంఈవో పోకల తాతయ్య అన్నారు. గురువారం కల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో అండర్ 14, అండర్ 17 విభాగంలో బాలబాలికలకు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్, చెస్, యోగా క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడలపై దృష్టి సారించాలని సూచించారు. మండల స్థాయిలో ప్రతిభ కనబరిచిన విజేతలను జోనల్‌స్థాయి క్రీడాపోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు కల్లూరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బహుమతులు అందించడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం శ్రీవాణి, పీఈటీలు రెడ్డిప్రవీణ్, రాజశేఖర్, లయన్స్‌క్లబ్ సభ్యులు మహ్మదాలి, రాజారెడ్డి, రామయ్య, నాగూర్‌బాషా, వెంకటసిద్దులు, ప్రకాశ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అబ్దుల్ అలీంకు డాక్టరేట్



పుంగనూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): చౌడేపల్లె జడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయుడు డి.అబ్దుల్ అలీంకు కోల్‌కతా ఆలియా యూనివర్సిటీ ఉర్దూ విభాగంలో పీహెచ్‌డీ డాక్టరేట్ పట్టాను ప్రదానం చేసింది. అబ్దుల్ అలీం స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ ప్రొఫెసర్ డాక్టర్ నీలోఫర్ ఫిర్దోస్ పర్యవేక్షణలో అలీ అహ్మద్‌ఫాత్మీ సాహిత్య సేవలపై విమర్శనాత్మక, పరిశోధనాత్మక అధ్యయనం పూర్తి చేశారు. మంగళవారం యూనివర్సిటీలో పట్టా అందుకున్నారు. ఎంఈడీలో గోల్డ్‌మెడల్ సాధించి ఎంఫిల్ పూర్తి చేసి ప్రస్తుతం జమాత్ ఏ ఇస్లామీ హింద్ (హల్కా ఆంధ్రప్రదేశ్) శూరా రాష్ట్ర కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. కోల్‌కతా యూనివర్సిటీలో పీహెచ్‌డీ డిగ్రీ పట్టా పొందడంతో పలువురు ముస్లింలు, ఉర్దూ సాహిత్యకారులు ఆయన్ను అభినందించారు.

తెలుగు తమ్ముళ్ల సంబరాలు



ఉదయ్‌కుమార్‌ను సన్మానిస్తున్న టీడీపీ నేతలు

శాంతిపురం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): శాంతిపురం మండల టీడీపీ అధ్యక్షుడిగా ఉదయ్‌కుమార్ నాయుడు ఎన్నిక కావడంపై తెలుగుదేశం పార్టీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. కార్యకర్తలు తరలివచ్చి ఆయనకు అభినందనలు తెలియజేశారు. సాయంత్రం ఎన్టీఆర్ విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. . పార్టీ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రీడలపై ఉత్సాహం అభినందనీయం



పతకాలు సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

సోమల, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు క్రీడా పోటీల్లో ఉత్సాహం చూపడం అభినందనీయమని ఎంఈవో శివరత్నమ్మ తెలిపారు. ఇటీవల సోమల మండల స్థాయి క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచి డివిజన్ స్థాయి పోటీలకు ఎంపిక కావడం హర్షనీయమన్నారు. గురువారం సూరయ్యగారిపల్లె, పెద్దఉప్పరపల్లె ఉన్నత పాఠశాలలో క్రీడా విజేతలను అభినందించి పతకాలను అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎంలు లోకేశ్వరి, శిరీష, పీడీలు శివకుమార్, శ్రీనివాసులు, ఉపాధ్యాయులు ఏపీ.రెడ్డి, చంద్రకళ, రాజేశ్, కుసుమ, విజయకుమార్, షర్మిళభాను తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మండల స్థాయి క్రీడా పోటీలు



విజేతలకు బహుమతులు అందిస్తున్న ఉపాధ్యాయులు

రొంపిచెర్ల, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రొంపిచెర్ల బాలుర ఉన్నత పాఠశాలలో రెండు రోజులుగా నిర్వహించిన మండల స్థాయి క్రీడా పోటీలు గురువారంతో ముగిశాయని ఎంఈవో శ్రీనివాసులు తెలిపారు. గురువారం పోటీలలో విజేతలుగా ఎంపికైన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ప్రధానోపాధ్యాయులు ధనలక్ష్మి, సర్పంచ్ ఇబ్రహీంఖాన్, వైస్ సర్పంచ్ లక్ష్మయ్య, చిన్ననాగరాజ, మదరస కమిటీ చైర్మన్ గౌస్‌పీర్ ఖాన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టీడీపీ మండలాధ్యక్షుడు వెంకటరమణకు సత్కారం



ఆనందరెడ్డి, వెంకటరమణలను సత్కరిస్తున్న టీడీపీ నేతలు

రామకుప్పం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం టీడీపీ మండలాధ్యక్షుడిగా గురువారం నూతనంగా వెంకటరమణ నియమితులు కావడంతో స్థానిక టీడీపీ కార్యాలయం వద్ద పార్టీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. మాజీ మండలాధ్యక్షులు ఆనందరెడ్డి, ప్రధాన కార్యదర్శి నరసింహులు, మాజీ ఎంపీపీ చిన్నికృష్ణల ఆధ్వర్యంలో నేతలు, కార్యకర్తలు వెంకటరమణను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి రవిరెడ్డి, కో-ఇన్‌చార్జి నవీన్, నేతలు గంట్లరెడ్డి, ఆదిల్, టీవీ రవి, మంజునాథ్, దివాకర్, రఘు, మురళీ, వీరనాగపురం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారి ఆపరేషన్‌కు ఎస్డీపీఐ రూ.లక్ష సాయం



పుంగనూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఇటీవల విద్యుదాఘాతానికి గురైన పలమనేరుకు చెందిన ఓ తొమ్మిదేళ్ల చిన్నారి ఆపరేషన్ ఖర్చులకు గురువారం ఎస్డీపీఐ నాయకులు రూ.లక్ష ఆర్థిక సాయం అందించారు. గురువారం స్థానిక ఎస్డీపీఐ కార్యాలయంలో బాధిత చిన్నారి కుటుంబ సభ్యులకు పార్టీ నాయకులు సిద్దిక్, ఆసీఫ్ ఆర్థిక సాయం పంపిణీ చేశారు. చిన్నారికి ఆపరేషన్ కోసం మరో రూ.4 లక్షలు అవసరం అవుతుందని దాతలు ఫోన్ నెంబర్లు 9032464292, 9010046018 ను సంప్రదించి సాయం అందించాలని కోరారు. ఎస్డీపీఐ నాయకులు ఆసీఫ్, షామీర్, చాంద్‌బాషా, మహ్మద్ అలీ, ఖాదర్‌బాషా, చోటూ పాల్గొన్నారు.

అధిక సెలవులు ఎలా తీసుకుంటారు?

● పెనుమూరు సీహెచ్‌సీ వైద్యులు, సిబ్బందిపై కలెక్టర్ ఆగ్రహం


నూతన భవన నిర్మాణం వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

పెనుమూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): అధిక సెలవులు తీసుకోవడంపై పెనుమూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)లోని వైద్యులు, సిబ్బందిపై కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఆస్పత్రి ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న భవనాన్ని తనిఖీ చేశారు. వైద్యులు, సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించి.. నెలలో వారంపైనే సెలవులు తీసుకోవడమేంటని ప్రశ్నించారు. అలాగే మందుల వినియోగం, డ్యూటీ సమయాలనూ పరిశీలించి, సూచనలిచ్చారు. ఈ సందర్భంగా హైస్కూల్‌కు ప్రహరీ కావాలని పాఠశాల కమిటీ ఛైర్మెన్ మునేంద్ర కోరగా, ఎంత ఖర్చువుతుందో అంచనా వేయాలని జడ్పీ కింద నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. తహసీల్దారు శ్రావణ్‌కుమార్, ఎంపీడీవో నీలకంఠేశ్వర్‌రెడ్డి, ఎంఈవో భాస్కర్‌నాయుడు, హెచ్‌ఎం రమేష్‌బాబు, ఏఈలు చరణ్, మురళి, నాయకులు పరమేశ్వర్ రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, రాజగోపాల్‌నాయుడు పాల్గొన్నారు.

విద్యార్థులు భక్తిభావాన్ని అలవర్చుకోవాలి

● టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు ప్రత్యేక అధికారి


సమావేశంలో ప్రసంగిస్తున్న మేడసాని మోహన్

పాలసముద్రం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు భక్తిభావాన్ని అలవర్చుకోవాలని టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు ప్రత్యేక అధికారి డాక్టర్ మేడసాని మోహన్ సూచించారు. గురువారం ఎస్ఆర్ఆర్ కండ్రిగ జడ్పీ హైస్కూల్‌లో ఆంధ్ర సాంస్కృతిక మంజరి, అత్తిమంజేరిపేట ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ముఖ్య అతిథిగా ప్రసంగించారు. ప్రతి ఒక్కరూ భాగవతంలోని పద్యాలను నేర్చుకోవాలన్నారు. రాష్ట్ర టీడీపీ సంయుక్త కార్యదర్శి భీమనేని చిట్టిబాబు నాయుడు మాట్లాడుతూ.. మేడసాని మోహన్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలని విద్యార్థులను కోరారు. హెచ్‌ఎం హరిత, పాలసముద్రం ప్రభుత్వజూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌హేమలత, విశ్రాంత ఆచార్యులు గోవిందరాజు, స్వరాజ్యలక్ష్మి, విశ్రాంతహెచ్‌ఎంలు వెంకటరాజు,రఘు,రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఆరోగ్యంపై మహిళలు దృష్టి పెట్టాలి: డీఎంహెచ్‌వో


ఐరాల పీహెచ్‌సీలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో సుధారాణి

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మహిళలు తమ ఆరోగ్యంపై దృష్టి పెట్టాలని డీఎంహెచ్‌వో సుధారాణి సూచించారు. 'స్వస్థ నారీ..' కార్యక్రమంలో భాగంగా గురువారం ఐరాల, కాణిపాకం పీహెచ్‌సీల్లో జరుగుతున్న వైద్యశిబిరాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు ప్రవీణ్, అనూష, స్వాతి, ఉషా, సంధ్య, శ్రీవాణి, అర్పిత తదితరులు పాల్గొన్నారు.

యాదమరి: మండలంలోని కోనాపల్లె గ్రామ సచివాలయంలో నిర్వహించిన 'స్వస్థ నారీ..' వైద్యశిబిరాన్ని ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ సుదర్శన్ గురువారం తనిఖీ చేశారు. వైద్యపరీక్షలు చేయించుకుంటున్న మహిళలకు పలు ఆరోగ్యసలహాలిచ్చారు. సీహెచ్‌వో శ్రీనివాసమూర్తి, సూపర్‌వైజర్లు లక్ష్మీపతి, సెల్వరాణి, హెల్త్ అసిస్టెంట్ సురేంద్రనాథ్ రెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

హోరాహోరీగా క్రీడా పోటీలు


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంఈవో వసుమతి దేవి

నింద్ర, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): నింద్ర జడ్పీ హైస్కూల్ మైదానంలో గురువారం మండల స్థాయి క్రీడా పోటీలు హోరాహోరీగా జరిగాయి. ఎంఈవో వసుమతి దేవి, శ్రీధర్‌రాజు ప్రారంభించగా, మండల క్రీడా కమిటీ కన్వీనర్ శ్రీనివాసులు, వివిధ పాఠశాలలకు చెందిన పీడీలు పాల్గొన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి సుమారు 500 మంది క్రీడాకారులు హాజరయ్యారు.

విజేతలు వీరే: వాలీబాల్, కబడ్డీ (సీనియర్) పోటీల్లో విజేతగా నింద్ర జడ్పీ హైస్కూల్ జట్టు నిలిచింది. అలాగే కబడ్డీ (జూనియర్) విభాగంలో విజేతగా కొత్తఆరూరు జడ్పీ హైస్కూల్, ఖోఖో పోటీల్లో అత్తూరు జడ్పీ హైస్కూల్ జట్టు విజేతగా నిలిచిందని హెచ్‌ఎంలు శ్రీనివాసులు, జాన్ డల్లాస్, ఎడ్వార్ట్, వ్యాయామ ఉపాధ్యాయులు జ్ఞానకుమార్, కార్తీక్, ప్రభాకర్ తెలిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

గుడిపాల, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తూ బావిలో పడి మృతి చెందిన రాజేష్ కుటుంబాన్ని గురువారం ఎమ్మెల్యే సోదరుడు గురుజాల జీవన్ పరామర్శించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. టీడీపీ మండల ఉపాధ్యక్షుడు ధన్ సింగ్, మాజీ కార్యదర్శి చంద్ర మోహన్ తదితరులు పాల్గొన్నారు. కాగా, బావిలోని రాజేష్ మృతదేహాన్ని వెలికితీసి బంధువులకు అప్పగించినట్లు ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు.

ఎంపీడీవో బాధ్యతల స్వీకారం


మనోహర్‌గౌడ్

గంగాధరనెల్లూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరు ఎంపీడీవోగా శేషగాని మనోహర్‌గౌడ్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన నెల్లూరు జిల్లా చిట్టమూరులో డిప్యూటీ ఎంపీడీవోగా పనిచేస్తూ పదోన్నతిపై ఇక్కడికొచ్చారు. ఈయన్ను టీడీపీ మండల అధ్యక్షుడు స్వామిదాస్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు కామసాని కోదండరెడ్డి, లోకమ్మ, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు ఎంపీడీవో కార్యాలయ ఏవో లోకేష్, సిబ్బంది సన్మానించారు.

ఇద్దరు మహిళల అదృశ్యం

బంగారుపాళ్యం/పాలసముద్రం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు ప్రాంతాలకు చెందిన ఇద్దరు మహిళలు అదృశ్యమయ్యారు. తవణంపల్లె మండలం దిగువ తడకరకు చెందిన రాజేష్ తన భార్య రమ్యతో కలిసి కేరళలో నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో రమ్య తన సొంతూరైన బంగారుపాళ్యం మండలం బొమ్మాయిపల్లెకు వచ్చారు. తిరిగి భర్త వద్దకు వెళుతున్నానని ఈనెల 16వ తేదీన పుట్టింటి నుంచి బయల్దేరింది. అయితే ఆమె కేరళకు రాకపోవడంతో భర్త ఈ విషయాన్ని అత్తకు తెలియజేశారు. అందరూ కలిసి బంధువులు, తెలిసిన వారిళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. ఈ క్రమంలో రమ్య తల్లి కళ ఇచ్చిన ఫిర్యాదుతో గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ప్రసాద్ తెలిపారు.

● పాలసముద్రం మండలంలోని బాలకృష్ణాపురం గ్రామానికి చెందిన పూర్ణిమ, ఉదయ్‌కుమార్‌లకు మూడేళ్ల క్రితం వివాహమైంది. బుధవారం దంపతుల మధ్య గొడవలు జరగడంతో భార్య ఇంటినుంచి అలిగి వెళ్లిపోయింది. బంధువులు, తెలిసిన వారి ఇళ్లలో వెతికినా ఆచూకీ తెలియలేదు. దాంతో గురువారం ఆమె భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చిన్నరెడ్డెప్ప తెలిపారు.



ఎల్లాపల్లె వద్ద చెరువు మొరవ పారడంతో రోడ్డుపైకొచ్చిన నీటి ప్రవాహం - మొరవ పారుతున్న గరిగలపల్లె చెరువు

గంగాధరనెల్లూరులో భారీ వర్షం

గంగాధరనెల్లూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరు మండలంలో బుధవారం రాత్రి భారీవర్షం (సుమారు ఐదు పదున్ల వర్షం) కురిసింది. ఎల్లాపల్లె, తూగుండ్రం, గరిగలపల్లె, కొత్తవెంకటాపురంలోని చెరువులు నిండిపోయి మొరవ పారుతున్నాయి. దీనివల్ల రైతులు, స్థానికులతోపాటు ద్విచక్రవాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. కొన్నిచోట్ల పంటలకు నష్టం వాటిల్లినట్లు రైతులు తెలిపారు.



తూగుండ్రం చెరువు మొరవపారి వేణుగోపాలపురానికి సమీపంలో నీట మునిగిన చెరకుతోట - మొరవ పారుతున్న కొత్తవెంకటాపురం చెరువు

నగరిలో 'నమస్తే' ప్రారంభం


'నమస్తే' కార్యక్రమాన్ని ప్రారంభించి, వివరాలు తెలియజేస్తున్న కమిషనర్ కృష్ణారెడ్డి

నింద్ర, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): నగరి పట్టణంలో వ్యర్థాలను సేకరించేవారి భద్రత కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన నమస్తే (నేషనల్ యాక్షన్ ఫర్ మెకనైజ్డ్ శానిటేషన్ ఎకోసిస్టమ్)ను గురువారం మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి ప్రారంభించారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్క్రాప్ షాపుల యజమానులు, డంప్ యార్డులో రోడ్డు పక్కన ఉండే ప్లాస్టిక్ బాటిళ్లు, పాత బట్టలు వంటి వ్యర్థాలను ఏరుకుని జీవనం సాగించేవారు పురపాలక సంఘ కార్యాలయంలో కానీ, సచివాలయల్లో కానీ వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. దీనివల్ల వారికి ఆరోగ్య భద్రత, ప్రభుత్వం ద్వారా అన్ని ప్రయోజనాలు చేకూర్చడం జరుగుతుందన్నారు. గుర్తింపు కార్డు ఇస్తారన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ పురుషోత్తం, పారిశుధ్య పర్యావరణ కార్యదర్శులు, మేస్త్రీలు, వేస్ట్ పికర్స్ పాల్గొన్నారు.

రామాలయ ఆస్తులు పరిరక్షించాలి


మంత్రి ఆనం రామనారాయణరెడ్డితో టీడీపీ నాయకులు

పెనుమూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పెనుమూరు కోదండ రామాలయం ఆస్తులను పరిరక్షించాలని టీడీపీ నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని అమరావతిలో కలిసి విన్నవించారు. పెనుమూరు, ఎస్ఆర్‌పురం టీడీపీ మండల అధ్యక్షులు రుద్రయ్యనాయుడు, గంధమనేని జయశంకర్ నాయుడు, టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి లోకనాథం నాయుడు, చిత్తూరు పార్లమెంటు కార్యదర్శి తలారి రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి: ఏఐటీయూసీ

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్పొరేషన్ పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ నాయకుడు జయశంకర్ డిమాండ్ చేశారు. గురువారం ఎస్టీయూ కార్యాలయంలో కార్మికులతో జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. సమస్యలను పరిష్కరించకుంటే ఈనెల 25వ తేదీనుంచి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

యానాది కాలనీలో మౌలిక వసతులపై ఆరా


స్థానికుల నుంచి అర్జీలు తీసుకుంటున్న ఎంపీడీవో పెంచల వీరేంద్ర, సిబ్బంది

యాదమరి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఓటేరుపల్లె యానాది కాలనీలో మౌలిక వసతులపై మండల రెవెన్యూ అధికారులు, పంచాయతీరాజ్ అధికారులు గురువారం ఆరా తీశారు. ప్రతి ఇంటికీ వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీవో పెంచల వీరేంద్ర, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్, సర్పంచ్ పత్తిపాటి భగవతి, పంచాయతీ కార్యదర్శి శైలజ, వీఆర్వోలు శ్రీనాథ్ రెడ్డి, రూపావతి, మల్లికార్జున పాల్గొన్నారు.

పంచాయతీలకు నిధుల మంజూరు

పాలసముద్రం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 13 పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం రెండో విడత నిధులు మంజూరైందని ఎంపీడీవో సతీష్ పేర్కొన్నారు. పంచాయతీల వారీగా.. ఆముదాలకు రూ.6,39,333, బాలకృష్ణాపురానికి రూ.4,31,981, గంగమాంబాపురానికి రూ.2,64,209, కోదండ రామాపురానికి రూ.53,949, కృష్ణజిమ్మాపురానికి రూ.3,95,970, నరసింహాపురానికి రూ.3,87,410, పాలసముద్రానికి రూ.10,10,984, సింహరాజుపురానికి రూ.2,27,623, శ్రీకావేరిరాజుపురానికి రూ.4,46,842, ఎస్.ఆర్.ఆర్. కండ్రిగకు రూ.1,73,946, తిరుమలరాజుపురానికి రూ.3,14,331, వనదుర్గాపురానికి రూ.2,79,249, వెంగళరాజుకుప్పానికి రూ.5,74,699 మంజూరయ్యాయన్నారు. ఈ నిధులు సర్పంచ్‌ల బ్యాంకు ఖాతాలకు జమైనట్లు వివరించారు.

ఇందిరానగర్‌లో సమస్యలకు పరిష్కారం


తాగునీటి సమస్యను పరిష్కరించిన మున్సిపల్ అధికారులు

నింద్ర, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): నగరి మున్సిపాలిటీలోని 11వ వార్డు ఇందిరానగర్‌లో ఇటీవల ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పర్యటించినప్పుడు తాగునీరు, వీధి లైట్లు, కాలువల సమస్యలను స్థానికులు ప్రస్తావించారు. ఎమ్మెల్యే ఆదేశాలతో స్థానిక టీడీపీ నాయకులు ఈ సమస్యలను మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. గురువారం ఈసమస్యలను పరిష్కరించడంపై ఎమ్మెల్యేకు, టీడీపీ నాయకులకు ఇందిరానగర్‌వాసులు కృతజ్ఞతలు తెలిపారు.

దేశమ్మకు కానుకగా 'గడప కవచాలు'



నింద్ర, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): నగరి పట్టణంలోని నేత్ర ప్రదాయిణి దేశమ్మకు తమిళనాడుకు చెందిన భక్తుడు కెప్టెన్ ప్రభాకర్ రూ.70 వేల మూలస్థాన గడప కవచాలను కానుకగా అందజేశారు. గురువారం ఆలయానికి కుటుంబ సమేతంగా విచ్చేసిన ఆయన ఈవో వెంకటేశ్వర్లుకు వీటిని అందజేశారు.

ఘన వ్యర్థాల నిర్వహణపై శిక్షణ


సమావేశంలో ప్రసంగిస్తున్న సహాయ కమిషనర్ ప్రసాద్

చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఘన వ్యర్థాల నిర్వహణపై వార్డు కార్యదర్శులు అవగాహన పెంచుకోవాలని సహాయ కమిషనర్ ప్రసాద్ చెప్పారు. గురువారం నగర పాలక కార్యాలయంలో ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ సంస్థ ఆధ్వర్యంలో వార్డు పర్యావరణ కార్యదర్శులు, అమినిటీ కార్యదర్శులకు సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై ఒక్క రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యదర్శులకు శిక్షకుడు శ్రీనివాసులు పలు సూచనలిచ్చారు.

వాహనాల వేలంతో రూ.3.70 లక్షల ఆదాయం

గుడిపాల, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు గురువారం నరహరిపేట పోలీస్‌స్టేషన్ ఆవరణలో బహిరంగ వేలం నిర్వహించారు. మొత్తం 37 వాహనాలకు డీఎస్పీ సాయినాథ్ ఆధ్వర్యంలో వేలం నిర్వహించగా రూ.3,70,800 ఆదాయం వచ్చిందని చిత్తూరు వెస్ట్ సీఐ శ్రీధర్ నాయుడు, గుడిపాల ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు. తహసీల్దార్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

పందుల బెడదతో ఇబ్బందులు


చెరువులో ఉన్న పందులు

ఐరాల, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఐరాల మండలంలోని ముదిగోళం పంచాయతీ పందికొట్టూరు గ్రామం వద్ద ఓ వ్యక్తి దాదాపు రెండు వందల పందులను మేపుతున్నాడు. వీటిని అక్కడున్న చెరువులోకి తోలడంతో పక్కనే ఉన్న పూతలపట్టు మండలం గోపాలకృష్ణాపురానికి చెందిన పొలాలపై పడుతున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పందుల కారణంగా తరచూ జ్వరాలు, మెదడువాపు వ్యాధితో ఇబ్బంది పడుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ విషయాలపై తరచూ పందులు మేపే వ్యక్తితో గొడవలు కూడా జరుగుతున్నాయి. ఇకనైనా సంబంధిత అధికారులు ఈ సమస్యను పరిష్కరించాలని పందికొట్టూరు, గోపాలకృష్ణాపురం వాసులు కోరుతున్నారు.

సంక్షిప్తంగా..

వ్యసనాలకు బానిస కావొద్దు

విజయపురం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వ్యసనాలకు బానిస కాకూడదని విద్యార్థులకు తహసీల్దార్ కిరణ్ సూచించారు. గురువారం పన్నూరు ఉన్నత పాఠశాల ఆవరణంలో విద్యార్థులకు మాదక ద్రవ్యాల వాడకంతో దుష్ఫలితాలు, స్వచ్ఛత కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో రాజేంద్ర, హెచ్‌ఎం జానకిరామరెడ్డి, ఎస్ఐ మహేష్‌బాబు, టీచర్లు పాల్గొన్నారు.

సన్మానం



యాదమరి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): తెలుగుభాషా సాహిత్యానికి, సమాజానికి సేవ చేస్తున్న డాక్టర్ వల్లేరు హరినాయుడిని గురువారం కీనాటంపల్లె పాఠశాలలో స్థానికులు సత్కరించారు. టీచర్లు, విద్యార్థులు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

ఎంపీటీసీ కుటుంబీకులకు పరామర్శ

విజయపురం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): శ్రీహరిపురం ఎంపీటీపీ, టీడీపీ నాయకుడు లక్ష్మీపతిరాజు కుటుంబీకులను జంబాడ సమీపంలోని నెహ్రూనగర్‌లో మాజీ మంత్రి ఆర్కే రోజా గురువారం పరామర్శించారు. ఆయన సతీమణి ఇటీవల మృతి చెందడంతో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. వైస్ ఎంపీపీ మంజు బాలాజీ, మండల వైసీపీ అధ్యక్షుడు శివరాజు, ఉపాధ్యక్షుడు సతీష్‌యాదవ్, నాయకులు పాల్గొన్నారు.

డ్వాక్రా సంఘాలకు చెక్కు పంపిణీ

ఐరాల, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా సంఘాల వారికి స్థానిక యూకో బ్యాంకులో గురువారం రూ.1,04,50,000 మెగా చెక్కును పంపిణీ చేశారు. బ్యాంకు జోనల్ మేనేజర్ శరవణన్‌సుబ్రహ్మణ్యం, ఏపీఎం రవి,సీసీలు సోమశేఖర్‌రెడ్డి, రవీంద్ర, బ్రాంచ్ మేనేజర్ భానుచందర్, సిబ్బంది తేజ, మౌనవి, దీక్షతి, భానుప్రకాష్‌రెడ్డి, హయాత్ బాషా, జవహర్, జయరామాచారి, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

'క్యూఆర్ కోడ్' ప్రదర్శన



గుడిపాల, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉచిత బస్సులకు షరతులు పెట్టి మహిళలను మోసం చేశారని ఎంపీపీ ప్రసాద్ రెడ్డి, వైసీపీ మండల అధ్యక్షుడు ప్రకాష్, వసంతాపురం రజనీ బాబు ఆరోపించారు. వసంతాపురం పంచాయతీలో రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమంలో భాగంగా గురువారం క్యూఆర్ కోడ్ ప్రదర్శించారు. నాయకులు జనార్ధన్, మధు, ప్రసాద్, డేవిడ్, సైమాన్, దీనా, రెడ్డెప్ప, చిట్టి, వెంకటేష్ రెడ్డి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

యూరియా బస్తాల పంపిణీ

గుడిపాల, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్తుకూరుపల్లెలో రైతులకు యూరియా బస్తాలను మండల వ్యవసాయ శాఖ అధికారి సంగీత, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి హేమాద్రి నాయుడు గురువారం పంపిణీ చేశారు. యూరియా పుష్కలంగా ఉందని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.భువనేశ్వరి పాల్గొన్నారు.

జనరల్ నాలెడ్జ్‌పై 28న పోటీలు

చిత్తూరు కల్చరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ భవన్‌లో ఈనెల 28వ తేదీన ప్రజాహిత సేవాసంస్థ, మాదిరెడ్డి మెమోరియల్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో 8, 9, 10 తరగతి విద్యార్థులకు జనరల్ నాలెడ్జ్‌పై పోటీలు నిర్వహించనున్నారు. విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రం అందజేస్తామని నిర్వాహకులు పేర్కొన్నారు.

దారి వసతి కల్పించండి


ఎంపీడీవోకు వినతిపత్రమిస్తున్న లక్ష్మీపురంవాసులు

వెదురుకుప్పం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): దారి వసతి కల్పించాలని కార్వేటినగరం మండలం లక్ష్మీపురంకు చెందిన వడివేలు, దేవరాజులు, కన్నయ్య కోరారు. ఈ మేరకు గురువారం ఎంపీడీవో చంద్రమౌళికి వినతిపత్రమిచ్చారు. బొట్టువారిపల్లె లెక్క దాఖలాల్లో సర్వే నెంబరు 284/2లో మూడు ఎకరాల పది సెంట్ల విస్తీర్ణం ఉంది. ఇందులో కొంతభాగం లక్ష్మీపురం గ్రామస్తులు శ్మశానానికి వాడుకుంటున్నారు. కుంట పోరంబోకు స్థలంలోని ఉత్తర భాగంలో రైతులు ఎప్పటినుంచో రాకపోకలు సాగిస్తున్నారు. కొందరు ఈ దారికి అడ్డుపడటంతో కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్‌కి వినతిపత్రాలిచ్చారు. అధికారులు పరిశీలించి, దారికి మార్కింగ్ కూడా ఇచ్చారు. అయినా కొందరు ఆ దారిలో వెళ్లకూడదని ఇబ్బంది పెడుతున్నారని.. దీనివల్ల పొలాల వద్దకు కూడా వెళ్లలేక పోతున్నామని లక్ష్మీపురంవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. విచారించి న్యాయం చేయాలని కోరారు.

తాగునీటి పైపులైనుకు మరమ్మతులు

గంగాధరనెల్లూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కాశీపల్లె బీసీ కాలనీలో వారంరోజులకుపైగా తాగునీటి పైపులైను దెబ్బతినడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న జిల్లా తెలుగుయువత మాజీ కార్యనిర్వాహక కార్యదర్శి దేవపత్ని ధనంజయనాయుడు చొరవ చూపి ఎమ్మెల్యే థామస్ దృష్టికి సమస్యను తీసుకెళ్లి, పంచాయతీ అధికారుల సహకారంతో గురువారం మరమ్మతులు చేయించారు. దీనిపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

'స్వామిత్వ'ను త్వరగా పూర్తిచేయండి: డీపీవో

గంగాధరనెల్లూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 'స్వామిత్వ'ను త్వరగా పూర్తిచేయాలని డీపీవో సుధాకరరావు ఆదేశించారు. గంగాధరనెల్లూరు ఎంపీడీవో మీటింగ్ హాలులో జరుగుతున్న కంప్యూటీకరణ పనులను గురువారం తనిఖీ చేశారు. వర్షాలు కురుస్తుండటంతో పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. గంగాధరనెల్లూరుకు సమీపంలో ఎస్‌డబ్ల్యూపీసీకి దారి సమస్యపై తహసీల్దార్, ఎంపీడీవో, పంచాయతీకార్యదర్శితో చర్చించినట్లు తెలిపారు. ఎంపీడీవో మనోహర్‌గౌడ్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ లోకేష్, పంచాయతీ కార్యదర్శులు శివయ్య, కుమార్, ముక్కళత్తూరు సచివాలయ సర్వేయర్ వాసు పాల్గొన్నారు.

గంగాధర నెల్లూరు ఎంపీడీవో కార్యాలయంలో కంప్యూటరీకరణ పనులను పరిశీలిస్తున్న డీపీవో సుధాకరరావు →

